టాప్ న్యూస్

## విజయశాంతి దంపతులకు బెదిరింపు మెసేజ్‌లు



- బంజారాహిల్స్ పీఎస్ లో ఫిర్యాదు
- చంద్రకిరణ్ రెడ్డిపై ఫిర్యాదు చేసిన విజయశాంతి భర్త శ్రీనివాస ప్రసాద్

03

## బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డికి టీజీపీఎస్సీ నోటీసులు

- వారం రోజుల్లో సమాధానం ఇచ్చి, క్షమాపణలు చెప్పాలని టీజీపీఎస్సీ డిమాండ్

02

## బిల్లి రావ్‌తో కేటీఆర్ డీల్?



- రూ.5 వేల కోట్లు.. 30 శాతం కమిషన్ చర్చలు
- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సంచలన ఆరోపణలు

02


Follow: @ANNTELUGU

13-04-2025

# మహా పత్రిక

ANN తెలుగు

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 132 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




**కంది రామచంద్రారెడ్డి**
**వీకెండ్ అనాలసిస్**

మోదీ 75 పై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. మోదీ రిటైర్మెంట్ తీసుకుంటారా లేదా? తానే తీసుకొచ్చిన 75 ఏళ్ళ నిబంధన పక్కనబెడతారా? అన్నది దేశప్రజలు ఎదురుచూస్తున్న ఆసక్తికర పరిణామం. ఒకవైపు నరేంద్ర మోదీపై సంఘ్ ఆగ్రహంగా ఉందన్న సంకేతాలు, మరోవైపు జాతీయ రాజకీయాల్లో రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్ వంటి నేతల ఎదుగుదల, మోదీకి వయసు పైబడుతుండడం, ప్రజల సెంటిమెంట్‌లో మార్పు, మిత్రపక్షాల మద్దతుతో మోదీ ప్రభుత్వం నడుస్తుండడం వంటి విషయాలన్నీ ఈ ఏడాది తీసుకోబోయే నిర్ణయంపై ప్రభావం చూపనున్నాయి. రాజకీయ ఒలింపిక్స్‌లో రేసులో కనిపించని క్రీడాకారులు కూడా బంగారు పతకాలు సాధిస్తారు. ఇపుడు కాకుంటే.. తర్వాతైనా మోదీకి వారసుడి రావాల్సిందే. మోదీ వారసుడి ఎంపికపై సంఘ్ మొదలుపెట్టిన సన్నాహాల వెనుక దీర్ఘకాల వ్యూహం కనబడుతోంది.

- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్

ఎడిటోరియల్ పేజీ 4లో

# ఇదీ మార్పు

## ప్రజా ప్రభుత్వంలో సామాన్యుడి విజయం

### ద్రవ్యోల్బణం తగ్గుదలపై సీఎం రేవంత్ హర్షం

### ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన



**హైదరాబాద్, మహా:** తెలంగాణలో పాలన మారిన కొద్ది నెలల లోపే, సామాన్య ప్రజల జీవనశైలిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. దేశంలో అత్యధిక ద్రవ్యోల్బణం ఉన్న రాష్ట్రంగా ఉన్న తెలంగాణ, ఇప్పుడు అత్యల్ప ద్రవ్యోల్బణం కలిగిన రాష్ట్రంగా మారడం "ప్రజల ప్రభుత్వ" విజయానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో ప్రజలు తీవ్రంగా ద్రవ్యోల్బణ భారం ఎదుర్కొనాల్సి వచ్చిందని, ముఖ్యంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకిన సందర్భాలు తరచూ చూశామని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత, సాధారణ ప్రజానీకాన్ని కేంద్రీకరించి అమలు చేస్తున్న విధానాలు తక్షణ ఉపశమనం కలిగించాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్‌లో పలు కీలక కార్యక్రమాలు పేర్కొన్నారు.

**"ఇది ప్రజల ప్రభుత్వం**

"ఇది మార్పు..!! ఇది ప్రజల ప్రభుత్వం..!!" అంటూ తన ప్రభుత్వ తీరును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గర్వంగా ప్రకటించారు. ప్రజల ఆకాంక్షలకు తగ్గ విధంగా చర్యలు తీసుకుంటామని, ఇది సరళమైన హామీ కాదని – అమలులోనే చూపిస్తున్నామని తెలిపారు.

**మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం:** రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారి ఆర్థిక భారం తగ్గించడం సాధ్యమైంది.

**కేవలం రూ.500కి ఎల్ పిజి సిలిండర్ :** గ్యాస్ సిలిండర్ ధరలు దేశవ్యాప్తంగా పెరుగుతున్న సమయంలో, తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వినూత్నంగా నిలిచింది.

**200 యూనిట్లు ఉచిత విద్యుత్ :** ఇళ్లకు ఉచితంగా 200 యూనిట్ల వరకు విద్యుత్ ఇవ్వడం ద్వారా మధ్య తరగతి మరియు పేద కుటుంబాలకు భారం తగ్గింది.

**రేషన్ కార్డు దారులకు చక్కటి బియ్యం పంపిణీ :** ఇప్పటికే ఉన్న రేషన్ సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచి, అధిక నాణ్యత కలిగిన బియ్యాన్ని ఉచితంగా అందించడం ద్వారా పోషకాహార భద్రతను పెంచారు.

**రూ. 10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ కవరేజ్ :** ఆరోగ్య సంరక్షణలో అద్భుతమైన పరిష్కారంగా, సామాన్య ప్రజలకు వైద్య ఖర్చులను భరించే అవకాశం

# జై హనుమాన్

## హైదరాబాద్ నగరమంతా కాషాయమయం

### జోరుగా శోభాయాత్రలు.. దేశవ్యాప్తంగా వేడుకలు



**మహా :** నేడు భారతదేశమే కాదు.. ప్రపంచమంతా హిందూ జీవన విధానానికి అలవాటు పడుతున్నారని.. ప్రపంచ దేశాల్లో జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తుతోందని ప్రముఖ స్వామీజీ, విశ్వహిందూ పరిషత్ జాతీయ నాయకులు, మాజీ పార్లమెంటు సభ్యులు రామ్ విలాస్ దాస్ వేదాంతి అన్నారు. ప్రపంచానికి శ్రీరాముడు ఆదర్శ పురుషుడు అనే విషయాన్ని రామభక్తుడు ఆంజనేయస్వామి నిరూపించాడన్నారు. శనివారం భాగ్యనగరంలో బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వీర హనుమాన్ విజయ శోభాయాత్ర బహిరంగ సభ గౌలిగూడ రాం మందిర్ దగ్గర శోభాయాత్రను ప్రారంభించిన ఆయన కోటి ఆంధ్రాబ్యాంక్ చౌరస్తా దగ్గర బహిరంగ సభలో మాట్లాడుతూ, ఉత్తర భారతదేశంతో పోల్చుకుంటే భాగ్యనగరంలో భక్తి ఎక్కువగా ఉందన్నారు.

మిగతా 2లో

# ట్రీ మ్యాన్ ఆఫ్ ఇండియా పద్మశ్రీ వనజీవి రామయ్య మృతి

## కోటి మొక్కలు నాటిన ప్రకృతి ప్రేమికుడు.. పర్యావరణ రక్షణకే అంకితమైన జీవితం


### ప్రధానమంత్రి మోదీ సహా, సీఎం రేవంత్, కేసీఆర్, మంత్రుల సంతాపం

**ఖమ్మం మహా:** పర్యావరణ పరిరక్షణకు తన జీవితాన్ని అంకితం చేసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ ప్రకృతి ప్రేమికుడు వనజీవి దరిపల్లి రామయ్య (88) శనివారం తెల్లవారుజామున ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుండెపోటుతో కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సహా మంత్రులు, రాజకీయ ప్రముఖులు, పర్యావరణ ప్రేమికులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

**కోటి మొక్కలతో పచ్చదన ప్రచారం**

ఖమ్మం జిల్లా రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన దరిపల్లి రామయ్య, చిన్నతనం నుంచే మొక్కలపై అమితమైన ఇష్టంతో కోటికి పైగా చెట్లను నాటి, 'వనజీవి'గా గుర్తింపు పొందారు.

మిగతా 2లో





# ఛత్తీస్ ఘడ్ లో ఎదురుకాల్పులు

## ముగ్గురు మావోయిస్టులు మృతి

**చర్ల, మహా ;** ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ డివిజన్ బీజాపూర్ జిల్లా అడవుల్లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు.జిల్లా నేషనల్ పార్క్ ఏరియా అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య భారీ ఎదురు కాల్పులు చోటు చేసుకున్నట్లు బీజాపూర్ ఎస్పీ జితేంద్ర కుమార్ తెలిపారు.

మిగతా 2లో

## దేశంలో ఉగ్రదాడులు జరగొచ్చు

### నిఘా సంస్థల హెచ్చరిక

### పాక్ ప్రేరేపిత దాడులకు ఛాన్స్

వివరాలు 2లో

# సుప్రీం కోర్టు డెడ్‌లైన్ మితిమీరిన జోక్యమే

## కేరళ గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్

**మహా:** శాసనసభ ఆమోదించిన బిల్లులపై రాష్ట్రపతి నుంచి గవర్నర్ వరకు నిర్దిష్ట గడువులోగా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీనిని న్యాయవ్యవస్థ 'మితిమీరిన జోక్యం'గా ఆయన అభివర్ణించారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో





## తాడ్‌బండ్ హనుమాన్ టెంపుల్‌కి ప్రీతిజింటా

**సికింద్రాబాద్, మహా:** హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఊరూవాడా వీరహనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. హైదరాబాద్‌లో వేలాది మంది భక్త జనసందోహం నడుమ హనుమాన్ శోభాయాత్ర కన్నులపండువగా సాగుతోంది. గౌలిగూడ నుంచి తాడ్‌బండ్ హనుమాన్ ఆలయం వరకు శోభాయాత్ర సాగనుంది. ఇదిలా ఉండగా.. హనుమాన్ జయంతి సందర్భంగా పంజాబ్ కింగ్స్ ఓనర్ ప్రీతి జింటా తాడ్‌బండ్ వీరాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. శనివారం ఉదయం తాడ్‌బండ్ హనుమాన్ ఆలయానికి వచ్చిన ప్రీతి జింటా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేటి సాయంత్రం ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్‌తో పంజాబ్ కింగ్స్ తలబడనుంది. ఈ సందర్భంగా పంజాబ్ కింగ్స్ విజయాన్ని కోరుతూ ప్రీతిజింటా వీరాంజనేయ స్వామిని దర్శించుకున్నారు.

# రేవంతే ముఖ్యమంత్రిగా ఉండి తీరుతారు

### అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా మంచి పాలన అందిస్తున్నారు.. అవినీతి లేకుండా పరిపాలన

### మీనాక్షి నటరాజన్ ఎలాంటి సమీక్ష నిర్వహించలేదు.. మంత్రి శ్రీధర్ బాబు ఫటాఫట్



**హైదరాబాద్, మహా:** రేవంతే ముఖ్యమంత్రిగా ఉంటారని.. ఉండి తీరతారని, ఇక్కడ చర్చకు తావులేదని మంత్రి శ్రీధర్ బాబు తేల్చి చెప్పారు. సీఎం రేవంత్ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా.. అవినీతి లేకుండా పరిపాలన చేస్తున్నారన్నారు. "మా పార్టీలో అందరూ సమర్థులే. అరవింద్ ఏ సందర్భంగా మాట్లాడారో తెలియదు. నాకు అరవింద్ చిన్నప్పటి నుండి తెలుసు కాబట్టే నా గురించి అలా అన్నాడేమో.

మిగతా 2లో

## ఏప్రిల్ 14 నుంచి భూ భారతి

### దశల వారీగా అమలు చేయనున్న ప్రభుత్వం

### ఆరు మాడ్యూల్స్ లో సులభంగా ఉండేలా కొత్త వెబ్సైట్

వివరాలు 2లో

## ఈవిఎంలను హ్యాక్ చెయొచ్చు

- అమెరికా ఇంటెలిజెన్స్ చీఫ్ తులసీ గబ్బార్డ్ సంచలనం
- ట్యాంపరింగ్ సాధ్యంకాదన్న సిఈసి జ్ఞానేష్ కుమార్

02

# ట్రీ మ్యాన్ ఆఫ్ ఇండియా పద్మశ్రీ వనజీవి రామయ్య మృతి

## కోటి మొక్కలు నాటిన ప్రకృతి ప్రేమికుడు.. పర్యావరణ రక్షణకే అంకితమైన జీవితం

### ప్రధానమంత్రి మోదీ సహా, సీఎం రేవంత్, కేసీఆర్, మంత్రుల సంతాపం

(మొదటి పేజీ తరువాయి)

"వృక్షో రక్షతి రక్షితః" (చెట్టు నిన్ను రక్షిస్తే, నీవు చెట్టును రక్షించు) అనే నినాదాన్ని జీవన సిద్ధాంతంగా స్వీకరించిన ఆయన, ప్రపంచానికి పచ్చదనం యొక్క ప్రాముఖ్యతను చాటిచెప్పారు. రోడ్ల పక్కన, గుడుల్లో, చెరువు కట్టలపై, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడం ఆయనకు అలవాటు. ఆయన నాటిన మొక్కలు నీడనిచ్చే మహావృక్షాలుగా మారి, ఆయన కృషికి నిదర్శనంగా నిలిచాయి. రామయ్య తన భార్య జానమ్మతో కలిసి ఈ హరిత యజ్ఞంలో పాల్గొన్నారు. శుభకార్యాలకు వెళ్లినప్పుడు మొక్కలను బహుమతిగా ఇచ్చి, వాటిని పెంచాలని ప్రోత్సహించేవారు. తన మనవరాళ్లకు చందనపుష్ప, హరిత లావణ్య, కబంధపుష్ప, వనశ్రీ వంటి చెట్ల పేర్లను పెట్టడం ఆయన ప్రకృతి పట్ల అచంచలమైన ప్రేమకు నిదర్శనం. మొక్కలు నాటడం గురించి ఎన్నో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. రామయ్య మాటలు ఎంతో ప్రభావ వంతంగా ఉండేవి. అందుకే భారత ప్రభుత్వం 2017లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.



**పర్యావరణానికే అంకితమైన జీవితం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి: "ప్రకృతి లేనిదే మానవ మనుగడ లేదని బలంగా నమ్మిన వనజీవి రామయ్య, ఒక వ్యక్తిగా మొక్కలు నాటడం ప్రారంభించి, మొత్తం సమాజాన్ని ప్రభావితం చేశారు. ఆయన జీవితం యువతకు ఆదర్శం. ఆయన మరణం సమాజానికి తీరని లోటు," అని సంతాపం తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్: "వనజీవి రామయ్య జీవితం రేపటి తరాలకు స్ఫూర్తిదాయకం. ఆయన చేసిన త్యాగం ప్రపంచ పర్యావరణ కృషిలో అసమాన్యం. తెలంగాణ హరిత హారం కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన సహకారం అమూల్యం," అని కొనియాడారు.

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క:**

"రామయ్య మృతి రాష్ట్రానికి, దేశానికి తీరని లోటు. ఆయన జీవితం భవిష్యత్ తరాలకు స్ఫూర్తి," అని అన్నారు.

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు:**

"కోటికి పైగా మొక్కలు నాటి, ఖమ్మం జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన రామయ్య మరణం ధరిత్రికి లోటు," అని సంతాపం వ్యక్తం చేశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ సంతోష్ కుమార్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి రామయ్య కుటుంబానికి సానుభూతి తెలిపారు.

**పద్మశ్రీతో సహా అసంఖ్యాక అవార్డులు**

రామయ్య కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2017లో ఆయనను పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. అంతేకాదు, సెంటర్ ఫర్ మీడియా సర్వీసెస్ నుంచి 'వనమిత్ర' అవార్డు (2005), గ్లోబల్ యూనివర్సల్ పీస్ సంస్థ నుంచి గౌరవ డాక్టరేట్, భారత ప్రభుత్వం నుంచి వనసేవా అవార్డు (1995) సహా 3,000కి పైగా షీల్డులు, అవార్డులు అందుకున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా 2000లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు మోపెడ్, నెలవారీ గౌరవ భత్యం కేటాయించారు.

**పాఠ్యాంశంగా రామయ్య జీవితం**

రామయ్య జీవితం తెలంగాణ, మహారాష్ట్రలోని విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచింది. తెలంగాణలో 6వ తరగతి సాంఘిక శాస్త్రం, మహారాష్ట్రలో 9వ తరగతి తెలుగు పాఠ్యాంశంలో ఆయన కృషిని చేర్చారు. ఈ పాఠ్యాంశాలు యువతకు పర్యావరణ రక్షణ యొక్క విలువను తెలియజేస్తున్నాయి.

**జీవిత విశేషాలు**

1937 జూలై 1న ఖమ్మం జిల్లా ముత్తగూడెంలో లాలయ్య, పుల్లమ్మ దంపతులకు జన్మించిన రామయ్య, 5వ తరగతి వరకు చదివారు. 15 ఏళ్ల వయసులో జానమ్మతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుండలు తయారు చేయడం, పాలు అమ్మడం వంటి వృత్తులతో కుటుంబాన్ని పోషిస్తూనే, 45 ఏళ్లుగా మొక్కల పెంపకానికి అంకితమయ్యారు. అనారోగ్యంతో బాధపడుతున్న చివరి రోజుల్లో కూడా మొక్కలు నాటే ఉద్యమాన్ని ఆపలేదు.

**చిరస్థాయిగా రామయ్య స్ఫూర్తి**

వనజీవి రామయ్య జీవితం ఒక వ్యక్తి సమాజాన్ని ఎంతగా ప్రభావితం చేయగలడో చాటిచెప్పింది. ఆయన నాటిన కోటి మొక్కలు, ఆయన స్ఫూర్తి రేపటి తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయి. "ప్రతి ఖాళీ స్థలంలో మొక్క నాటాలి" అనే ఆయన సందేశం పర్యావరణ పరిరక్షణకు శాశ్వత దీక్షగా మిగిలిపోతుంది.



# ఛత్తీస్ ఘడ్ లో ఎదురుకాల్పులు

## ముగ్గురు మావోయిస్టులు మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఇంకా పెద్ద సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందే అవకాశం ఉందని, ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇంద్రావతి టైగర్ రిజర్వుడు ఫారెస్టులో మావోయిస్టులు ఉన్నట్లు నిర్ధిష్టమైన సమాచారంతో భద్రతా దళాలు కూంబింగ్ నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో మావోయిస్టులు తారసు పడటంతో వారి మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. మధ్యాహ్నం వరకు రెండు వైపులా అడపాదడపా కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. మరికొందరు గాయపడ్డారని గాయపడిన వారి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

# రేవంతే ముఖ్యమంత్రిగా ఉండి తీరుతారు



(మొదటి పేజీ తరువాయి)

మా పార్టీలో ఎవరికి ఏ పదవి ఇవ్వాలో అంతిమ నిర్ణయం అధిష్టానానిదే'' అంటూ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'సచివాలయంలో మీనాక్షీ నటరాజన్ ఎలాంటి సమీక్ష నిర్వహించలేదు. ఆమె మమ్మల్ని కలవడానికి సచివాలయానికి వచ్చారు. సచివాలయానికి ఎవరైనా రావచ్చు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కూడా సచివాలయానికి వస్తారు'' అని శ్రీధర్‌బాబు చెప్పుకొచ్చారు.

# దేశంలో ఉగ్రదాడులు జరగొచ్చు

## నిఘా సంస్థల హెచ్చరిక.. పాక్ ప్రేరేపిత దాడులకు ఛాన్స్



**మహా:** మళ్లీ ఉగ్ర ముప్పు. భారత్‌లో ఉగ్రదాడులు జరగవచ్చని నిఘా సంస్థలు హెచ్చరికలు చేశాయి. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడులకు దిగవచ్చని హెచ్చరించాయి. ఇప్పటికే రైల్వేశాఖను అప్రమత్తం చేశాయి. డ్రోన్, ఐఈడీతో ఉగ్రవాదులు దాడులు చేసే అవకాశం ఉందని వెల్లడించాయి. నదీమార్గాల ద్వారా తీవ్రవాదులు చొరబడవచ్చని చెప్పాయి. 26/11 ముంబయి దాడుల్లో కీలక కుట్రదారు అయిన తహవ్వుర్ రాణాను అమెరికా నుంచి భారత్‌కు తీసుకువచ్చి విచారిస్తోన్న తరుణంలో ఈ అలర్ట్ రావడం సంచలనంగా మారింది. 2008 నవంబర్ 26న 10 మంది పాకిస్థానీ ఉగ్రవాదులు సముద్రమార్గం ద్వారా ముంబయికి చేరుకొని మారణహోమం సృష్టించారు. సీఎస్ఎంటీ, ఒబెరాయ్ ట్రైడెంట్, తాజ్ హోటల్ తదితర ప్రాంతాల్లో గన్స్‌తో, బాంబులతో దాడులకు పాల్పడ్డారు. నవంబర్ 29 వరకు ఈ మారణహోమం కొనసాగింది. ఈ ఉగ్రదాడుల్లో 18 మంది భద్రతా సిబ్బంది సహా 166 మంది ప్రాణాలు కోల్పోగా, అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఉగ్రవాదులతో పోరాడుతూ అప్పటి యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) చీఫ్ హేమంత్ కర్కరే, ఆర్మీ మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్, ముంబయి అదనపు పోలీస్ కమిషనర్ అశోక్ కామ్టే, సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ విజయ్ సలాస్కర్‌లు అమరులయ్యారు. కాగా రాణా పాకిస్థాన్ మూలాలున్న కెనడా జాతీయుడు. డేవిడ్ హెడ్లీతోపాటు 26/11 ముంబయి దాడుల్లో కీలక సూత్రధారిగా ఉన్నాడు.

**భారత్ లోకి చొరబాటు యత్నాలు**

జమ్మూలోని అఖ్నూర్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వద్ద, భారత్‌లోకి చొరబడే ప్రయత్నం చేసిన ఉగ్రవాదులను భద్రత దళాలు సమర్థవంతంగా అడ్డుకున్నాయి. అయితే ఉగ్రవాదులను నిరోధించే క్రమంలో ఇండియన్ ఆర్మీకి చెందిన జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జేసీఓ) సుబేదార్ కుల్దీప్ సింగ్ అమరుడైనట్లు అధికారులు తెలిపారు. "దేశంలోకి చొరబడాలనే ఉగ్రవాదుల ప్రయత్నాన్ని సుబేదార్ కుల్దీప్ సింగ్, అతని బృందం భగ్నం చేసింది. ఈ ప్రయత్నంలో కుల్దీప్ సింగ్ అమరులయ్యారు. ఈ దుఃఖ సమయంలో మేము వారి కుటుంబానికి సంఘీభావం తెలియజేస్తున్నాం." అని జమ్మూకు చెందిన వైట్ నైట్ కార్ప్స్, ట్వీట్ చేసింది.

# బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డికి టీజీపీఎస్సీ నోటీసులు

## వారం రోజుల్లో సమాధానం ఇచ్చి, క్షమాపణలు చెప్పాలని టీజీపీఎస్సీ డిమాండ్

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డికి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరువునష్టం దావా నోటీసులు పంపింది. గ్రూప్ 1 ఫలితాల విషయంలో తమపై తప్పుడు ఆరోపణలు చేశారని చెప్పింది. వారం రోజుల్లో సమాధానం ఇచ్చి, క్షమాపణలు చెప్పాలని టీజీపీఎస్సీ డిమాండ్ చేసింది. వారం రోజుల్లో సమాధానం చెప్పకపోతే పరువునష్టం కేసులు, ఇతర క్రిమినల్ కేసులు బుక్ చేస్తామని హెచ్చరించింది. టీజీపీఎస్సీపై ఎలాంటి ఆరోపణలు చేయొద్దని, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టకూడదని తెలిపింది. కాగా, ఇటీవల రాకేశ్ రెడ్డి హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. గ్రూప్ 1 మెయిన్ అన్ని పేపర్లను రీవాల్యుయేషన్ చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణతో పాటు వాల్యుయేషన్‌లో తప్పిదాలు జరిగాయని ఆరోపించారు. వాటిని టీజీపీఎస్సీ సరిదిద్దుకోవాలని అన్నారు. తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు.



# బిల్లి రావ్‌తో కేటీఆర్ డీల్?

- రూ.5వేల కోట్లు.. 30 శాతం కమిషన్ చర్చలు
- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సంచలన ఆరోపణలు

**హైదరాబాద్, మహా:** ఐఎంజి సంస్థ యజమాని బిల్లీ రావుతో 30 శాతం కమిషన్‌కు.. 5 వేల కోట్లతో డీల్ మాట్లాడుకుంది కేటీఆరే అంటూ సంచలన ఆరోపణలు చేశారు పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్. శనివారం ఏఎన్ఎన్ మహాతో మాట్లాడుతూ ఈ భూమిని వదిలేసేందుకు బీఆర్ఎస్ హయాంలో చర్చలు జరిగాయని ఆరోపించారు. హైదరాబాద్‌లోనే 10 వేల ఎకరాల భూమిని కేసీఆర్ హయాంలో అమ్మేశారని.. దమ్ముంటే ఆ భూముల అమ్మకంపై చర్చకు రావాలని సవాల్ చేశారు. ఫార్ములా ఇకార్ రేసు కేసులో కేటీఆర్ రేపో మాపో అరెస్ట్ అవడం ఖాయమని.. అందుకే కేటీఆర్ అరెస్ట్‌ను హెచ్ సియుకు లింక్ చేసేందుకు ట్రై చేస్తున్నారని ఆరోపించారు.

# ఈవిఎంలను హ్యాక్ చెయొచ్చు

- అమెరికా ఇంటెలిజెన్స్ చీఫ్ తులసీ గబ్బార్డ్ సంచలనం
- ట్యాంపరింగ్ సాధ్యంకాదన్న సిఈసి జ్ఞానేష్ కుమార్

**మహా:** అమెరికా ఇంటెలిజెన్స్ చీఫ్ తులసీ గబ్బార్డ్ ఈవీఎంలంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈవీఎంలంలను ట్యాంపరింగ్ చేయొచ్చంటూ బాంబు పేల్చారు. ఈవీఎం లను హ్యాకింగ్ చేయొచ్చు, ఈవీఎం ల ద్వారా ఎలక్షన్లు చాలా బలహీనమైనది అన్న తులసీ గబ్బార్డ్ వ్యాఖ్యలపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ స్పందించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ శనివారం తులసీ గబ్బార్డ్ వ్యాఖ్యలపై స్పందించారు. ఈ వివాదాస్పదవ్యాఖ్యలకు కౌంటరిచ్చారు. దేశాలనుబట్టి ఎలక్షన్ ప్రాసెస్ ఉంటుంది..ఈవీఎం చాలా సేఫ్.. ట్యాంపరింగ్ చేయడం సాధ్యంకాదు అనిజ్ఞానేష్ కుమార్ అన్నారు.

# జై హనుమాన్

## హైదరాబాద్ నగరమంతా కాషాయమయం

### జోరుగా శోభాయాత్రలు..దేశవ్యాప్తంగా వేడుకలు




(మొదటి పేజీ తరువాయి)

హిందూ సంఘటనలో భాగ్యనగరం భారతదేశానికి దిక్సూచిగా మారుతుందన్నారు. తాను గతంలో చాలాసార్లు భాగ్యనగరం వచ్చానని, అయితే ఇప్పుడు చూస్తే ఇక్కడ రోజురోజుకు హిందూ సంఘటన బలపడుతుందని ఆనందం వ్యక్తం చేశారు. హిందువులు ఏది చేసినా చట్టానికి లోబడే పనిచేస్తారని, అయోధ్య రామ మందిర నిర్మాణ విషయంలో కూడా సుప్రీంకోర్టులో విజయం సాధించాక అయోధ్యలో భవ్య దివ్య రామ మందిరం నిర్మాణం చేసుకున్నామని చెప్పారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణంతో విశ్వహిందూ పరిషత్ పూర్వ అధ్యక్షులు దివంగత అశోక్ సింగాల్ తోపాటు ఎంతోమంది సాధుసంతుల సంకల్పం నెరవేరిందన్నారు. అయోధ్య ఉద్యమంలో తాను 25 సార్లు జైలు జీవితం అనుభవించానని, ఇది తనకు గర్వకారణం అని చెప్పారు. రామ మందిరం నిర్మాణం ఇంకొంచెం మిగిలి ఉందని, అది పూర్తికాగానే ఇంకా చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని గుర్తు చేశారు. మధుర శ్రీకృష్ణ మందిరం, కాశీ విశ్వనాథ మందిరం నిర్మించాలని పరోక్షంగా గుర్తు చేశారు. ఆ తర్వాత ఈ దేశం సుభిక్షంగా ఉండాలంటే రామ రాజ్యం సాధించాలని, అందుకు ఆంజనేయస్వామి ఆశీస్సులు తప్పక అవసరమని చెప్పారు. ఆంజనేయస్వామి ఆశీస్సులు పుష్కలంగా ఉండటంతో దేశమంతా కాషాయం జెండా రెపరెపలాడుతోందని పేర్కొన్నారు. అసాధ్యం అనుకున్న కాశ్మీర్ సమస్యను పరిష్కరించుకున్నామని, నేడు కాశ్మీర్ తో పాటు మణిపూర్, అస్సాం, మేఘాలయ , త్రిపుర, ఒరిస్సాతోపాటు అనేక హిందూ వ్యతిరేక ప్రాంతాలలో కూడా ఈరోజు ఆంజనేయస్వామి దయవల్ల కాషాయం జెండా ఎగురుతోందన్నారు. ఆంజనేయస్వామి అనుగ్రహం వల్ల తెలంగాణలో కూడా కాషాయం జెండా ఎగరాలని స్వామీజీ ఆకాంక్షించారు. పరోక్షంగా బిజెపి అధికారంలోకి రావాలని కోరుకున్నారు. హిందూ సంక్షేమం కోసం తాను 125 కోట్ల సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశానని చెప్పారు. ఆంజనేయస్వామి అనుగ్రహం ఉంటే కానిది లేదని, లంకను దహనం చేసి సముద్రంలో వంతెన నిర్మించిన బలశాలి ఆంజనేయుడు అని.. ఆయన అనుగ్రహంతోనే అయోధ్యలో భవ్య మందిరం నిర్మాణం అయిందని చెప్పారు. అదేవిధంగా మూడుసార్లు కేంద్రంలో ఆంజనేయస్వామి అనుగ్రహంతోనే కాషాయ జెండా రెపరెపలాడిందని.. వచ్చే రోజులలో తెలంగాణలో కూడా కాషాయ జెండా రెపరెపలాడాలని రామ్ విలాస్ వేదాంతి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటెల రాజేందర్ , ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, రాష్ట్ర నాయకులు రామరాజు, పగుడాకుల బాలస్వామి, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, దుర్గా వాహిని రాష్ట్ర కన్వీనర్ వాణి సక్కుబాయి, కుమార్ స్వామి, సుభాష్ చందర్, ఇతర ప్రముఖ నాయకులు భారీగా హాజరై ర్యాలీలో పాల్గొన్నారు.

## సుప్రీం కోర్టు డెడ్‌లైన్

# మితిమీరిన జోక్యమే



(మొదటి పేజీ తరువాయి)

శాసన సభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించాలా? వద్దా? అనేది పూర్తిగా పార్లమెంట్ పరిధిలోని విషయమని, ఇది ఏ మాత్రం కోర్టుల పరిధిలోని అంశం కాదని ఆర్లేకర్ పేర్కొన్నారు.

**సుప్రీంకోర్టు ఆ అధికారం లేదు**

సుప్రీంకోర్టు తీర్పుపై ఆర్లేకర్ మరో అడుగు ముందుకేసి తనదైన రీతిలో స్పందించారు. తమిళనాడు, కేరళ సమస్యలు భిన్నమైనవని ఆయన అన్నారు. ఏదేమైనా ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనం పరిశీలనకు పంపించకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు.

**కోర్టు తీర్పుల్లో జాప్యం ఎందుకు?**

'బిల్లులపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమే. కానీ అది కేవలం కార్యనిర్వహక వర్గానికి మాత్రమే పరిమితమైంది కాదు. హైకోర్టులు, సుప్రీంకోర్టులు ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి. న్యాయమూర్తుల వద్ద ఈ జాప్యాలకు తగిన కారణాలు ఉన్నట్లే, గవర్నర్‌లకు కూడా తగిన కారణాలు ఉంటాయి. దానిని అందరూ అంగీకరించాల్సిందే' అని అర్లేకర్ అన్నారు. గవర్నర్లు బిల్లులు ఆమోదించడానికి తగిన కాలపరిమితి ఉండాలని ప్రజలు భావిస్తే, దానిని పార్లమెంట్‌లో చర్చించి, తరువాత మాత్రమే అమలు చేయాలని ఆర్లేకర్ అన్నారు.

**ఇది చారిత్రాత్మకం**

మరోవైపు రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు చర్య తీసుకోవడానికి గడువు విధిస్తూ సుప్రీంకోర్ట్ ఆదేశించడాన్ని రాజ్యసభ ఎంపీ కబిల్ సిబల్ సమర్థించారు. సుప్రీం తీర్పు సమాఖ్యవాదానికి ఎంతో మంచిదని, చరిత్రాత్మక తీర్పు అని కొనియాడారు. సుప్రీంకోర్ట్ తాజా తీర్పుతో, డీఎంకే నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వానికి అది పెద్ద విజయం లభించింది. దేశంలో మొదటిసారి గవర్నర్ ఆమోదం లేకుండానే 10 బిల్లులు చట్టంగా మారాయి.

# ఏప్రిల్ 14 నుంచి భూ భారతి

## దశల వారీగా అమలు చేయనున్న ప్రభుత్వం

### ఆరు మాడ్యూల్స్ లో సులభంగా ఉండేలా కొత్త వెబ్‌సైట్

**మహా:** కొత్త భూ భారతి చట్టం అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14 నుంచి అమల్లోకి రానున్నది. ఈమేరకు తెలంగాణ భూ భారతి (రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్స్) యాక్ట్, 2025 ఆవిష్కరణకు డేట్ ఫిక్స్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లాంచ్ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భూ భారతి చట్టం ప్రొవిజన్స్‌తో కొత్త పోర్టల్‌ను ప్రారంభించనున్నారు. శిల్ప కళావేదికగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి కలెక్టర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, శిల్పారామం స్పెషల్ ఆఫీసర్లను సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ ఆదేశించారు. కొత్త భూ భారతి చట్టం ఒకేసారి అమల్లోకి రావడం లేదు. దశల వారీగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకురానున్నారు. మొదటి ఫేజ్ ను ప్రారంభించేందుకు అటు రెవెన్యూ, ఇటు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ధరణిలో 33కు పైగా మాడ్యూల్స్ ఉండగా, భూ భారతిలో కేవలం 6 మాడ్యూల్స్‌తో సమస్యలను సులభంగా పరిష్కరించేలా కొత్త వెబ్ సైట్ రూపొందించింది. దీంతో ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండానే అప్లికేషన్లు పెట్టుకునే అవకాశం లభించనున్నది. ధరణి పోర్టల్ స్లోగా ఉండటంతో పాటు యూజర్ ఫ్రెండ్లీగా లేదు. దీంతో యూజర్ ఫ్రెండ్లీ భూ భారతిని తీసుకురావడమే కాకుండా.. వెబ్ పోర్టల్ స్పీడ్ ను పెంచారు. ఇక అప్పీళ్ల వ్యవస్థ కూడా అందుబాటులోకి రానున్నది. భూ భారతి చట్టంలో తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలో అప్పీల్ వ్యవస్థ ఉంది. ధరణిలో ఏం రిజెక్ట్ చేసినా కోర్టులపై ఆధారపడాల్సి వచ్చేది. భూ భారతిలో జిల్లా స్థాయిలోనే అప్పీల్ వ్యవస్థ పెట్టారు. దీంతో రైతులకు సమయం, ఖర్చు ఆదా కానున్నది. గతేడాది డిసెంబర్ లో అసెంబ్లీ, కౌన్సిల్లో భూ భారతి బిల్లుకు ఆమోదం లభించింది. గవర్నర్ జనవరి 3వ తేదీన ఆమోదించగా.. జనవరి 20వ తేదీన ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. భూ భారతి పోర్టల్,



భూధార్ విధానం, కొత్త పహాణీ వ్యవస్థతో రైతుల సమస్యలు పరిష్కారమై, పారదర్శక భూ రికార్డులు అందుబాటులోకి రానున్నాయి.

**డౌట్స్ క్లియర్ చేసుకునేందుకు చాట్బాట్**

భూ భారతి పోర్టల్లో ఒక చాట్ బాట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. దీంతో పాటు ఒక ప్రత్యేక యాప్ను కూడా తీసుకురావాలని.. ఇందులో ఎం వ్యాలెట్ మాదిరి ప్రతి రైతు వారికి సంబంధించిన వివరాలను టెంపరరీ భూధార్ నంబర్తో కలిగి ఉండేలా తీసుకువస్తున్నారు. ఇక చాట్బాట్లో భూ భారతి పోర్టల్లో ఏదైనా డౌట్ క్లియర్ చేసుకోవాలన్నా చాట్ బాట్ ఉపయోగపడనుంది. ఏ సమస్యకు ఏ అప్లికేషన్ పెట్టుకోవాలి? ఎలాంటి డాక్యుమెంట్లు అవసరమో కూడా చెప్పనున్నది. చాట్‌బాట్ భూ భారతి చట్టం ప్రయోజనాలను, హక్కులను సరళంగా వివరిస్తూ, రైతులను చైతన్యం చేయనున్నది. చాట్‌బాట్ తో రైతులతో పాటు ప్రభుత్వానికి కూడా ఎన్నో ప్రయోజనాలు అందనున్నాయి. తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో సమాచారం కోసం వచ్చే రైతుల రద్దీ తగ్గుతుంది. అధికారుల వర్క్‌లోడ్ తగ్గి, వేగంగా సమస్యలు పరిష్కారం అవుతాయి. పైగా, పోర్టల్ సాంకేతిక సమస్యలను చాట్‌బాట్ గుర్తించి, అధికారులకు నివేదిస్తూ వ్యవస్థను మెరుగుపరుస్తుంది.

# చైనాలో ఇసుక తుపాను బీభత్సం

## వందలాది విమాన, రైళ్ల సర్వీసులు రద్దు

**మహా:** చైనాను భీకర గాలులు అతలాకుతలం చేస్తున్నాయి. ఇసుక తుపాను, భారీ గాలులతో రాజధాని బీజింగ్‌లో చెట్లు నేలకొరిగాయి. ఈ నేపథ్యంలో చైనా ప్రభుత్వం అప్రమత్తమైంది. వందలాది విమాన సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. బీజింగ్, డాక్సింగ్‌లో 693 విమాన సర్వీసులు రద్దు చేయడంతో పాటు, రైళ్లను కూడా నిలిపివేశారు. దుమ్ము తుపానులు చెలరేగడంతో.. అధికారులు పర్యాటక ప్రదేశాలను మూసేశారు. చైనాకు తీవ్ర తుఫాన్ హెచ్చరికలు జారీ అయ్యాయి. వాతావరణ



శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. గంటకు 150 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని.. ప్రజలంతా ఇళ్లల్లోనే ఉండాలని అలర్ట్ చేసింది. దేశంలోని ఉత్తర, తీర ప్రాంతాలలో తీవ్రమైన ప్రభావం ఉంటుందని అధికారులు హెచ్చరించారు.

## సోనియా, రాహుల్ ఆస్తులు స్వాధీనానికి ఈడీ నోటీసులు




**ఢిల్లీ :** నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.700 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసేందుకు చర్యలు ప్రారంభించింది. నేషనల్ హెరాల్డ్‌ను ప్రచురించే ఏజేఎల్ సంస్థను యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ కొనుగోలు చేసింది. ఇందులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు 38 శాతం చొప్పున వాటా ఉంది. తాజాగా...ఢిల్లీ, ముంబై, లక్నో నగరాల్లో ఉన్న ఏజేఎల్ ఆస్తులను ఈడీ గుర్తించింది. వాటిని స్వాధీనం చేసుకునేందుకు ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద చర్యలు చేపట్టింది. జప్తు చేయనున్న ఆస్తుల్లో ఢిల్లీలోని హెరాల్డ్ హౌస్ కూడా ఉంది. గతంలోనే ఈ ఆస్తులను ఈడీ తాత్కాలికంగా జప్తు చేసింది. అయితే, ఇప్పుడు వాటిని పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమైంది. యంగ్ ఇండియన్ సంస్థ ఏజేఎల్ ఆస్తులను ఉపయోగించి రూ.18 కోట్ల నకిలీ విరాళాలు, రూ.38 కోట్ల నకిలీ అద్దెలు, రూ.29 కోట్ల నకిలీ ప్రకటనల ద్వారా అక్రమంగా డబ్బు సంపాదించిందని ఈడీ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంలో మనీ లాండరింగ్ జరిగిందని ఈడీ దాదాపు నిర్ధారణకు వచ్చింది. అందుకే పీఎంఎల్ఏ కింద ఆస్తులను జప్తు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది.

## వక్ఫ్ చట్టాన్ని అమలు చేయబోం: మమతా బెనర్జీ

### మంగళవారం నుంచి అమల్లోకి వచ్చిన వక్ఫ్ చట్టం

### రాజకీయాల కోసం అల్లర్లకు పాల్పడవద్దన్న మమతా

### చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ఉపేక్షించమని హెచ్చరిక



**మహా :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్టాన్ని పశ్చిమ బెంగాల్‌లో అమలు చేయబోమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. వక్ఫ్ చట్టం మంగళవారం నుంచి అమలులోకి వచ్చిన నేపథ్యంలో కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో బెంగాల్‌లోని మాల్దా, ముర్షిదాబాద్, దక్షిణ 24 పరగణాలు, హుగ్లీ ప్రాంతాలలో నిరసనకారులు ఆందోళనలు నిర్వహించి రోడ్లను దిగ్బంధించారు. వారిని నిలువరించేందుకు ప్రయత్నించిన పోలీసులపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ స్పందిస్తూ, ప్రతి జీవితం ఎంతో విలువైనదని, రాజకీయాల కోసం అల్లర్లకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. అల్లర్లకు పాల్పడేవారు సమాజానికి ప్రమాదకారులని, వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇలాంటి ప్రవర్తనను ఉపేక్షించేది లేదని ఆమె తేల్చి చెప్పారు. కొన్ని పార్టీలు రాజకీయ లబ్ధి కోసం మతాన్ని దుర్వినియోగం చేసే ప్రయత్నం చేస్తున్నాయని, అలాంటి చర్యలకు లొంగవద్దని సూచించారు. మతం అంటే మానవత్వం, నాగరికత, సామరస్యం అని ఆమె అన్నారు. శాంతి, సామరస్యాన్ని కాపాడుకోవాలని ప్రతి ఒక్కరిని కోరారు. ఈ చట్టాన్ని తాము చేయలేదని, వ్యతిరేకిస్తున్న వారు కేంద్ర ప్రభుత్వం వద్ద సమాధానం కోరాలని ఆమె సూచించారు. వక్ఫ్ చట్టాన్ని బెంగాల్‌లో అమలు చేయబోమని స్పష్టం చేశారు.

## విభజన సమస్యల పరిష్కారం కోసం తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ

### గత భేటీలో తీసుకున్న నిర్ణయాలపై ప్రధాన చర్చ



**మహా :** రెండు తెలుగు రాష్ట్రాల ప్రయోజనాల కోసం త్వరలోనే సీఎంలు భేటీ కానున్నట్టు సమాచారం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విభజన జరిగి 10 సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఇంకా విభజన సమస్యలు అపరిష్కృతంగానే ఉండడం వల్ల ఆ సమస్యలను పరిష్కరించడం కోసం రెండు రాష్ట్రాల సీఎంలు భేటీ కానున్నట్టు సమాచారం. గత ఏడాది జూలైలో ప్రజా భవన్ లో ఇరు రాష్ట్రాల సీఎంల భేటీ జరిగింది. చట్టప్రకారం జరగాల్సిన పంపకాల పైన ఉరువురు సీఎంలు చర్చించారు. కొన్ని అంశాలపై చర్చించి వాటి అమలు తదితర అంసాలపై అధికారులతో చర్చించి మళ్లీ మరోమారు భేటీ కావాలని అనుకున్నారు. ఈ క్రమంలోనే అప్పుడు జరిగిన చర్చల తర్వాత వివిధ అంశాలపై చోటు చేసుకున్న పురోగతి ఏమిటి అన్నది తాజాగా జరగనున్న భేటీలో చర్చించనున్నారు. తెలుగు రాష్ట్రాలలో అపరిష్కృతంగా ఉన్న విభజన సమస్యలను పరిష్కరించడం కోసం ఈ భేటీ ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. త్వరలోనే సమావేశం నిర్వహించాలని యోచన రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు సామరస్య పూర్వకంగా కలిసి కూర్చుని మాట్లాడుకుంటే సమసిపోయే సమస్యలు చాలానే ఉన్నాయి ఈ క్రమంలోనే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు త్వరలోనే సమావేశాన్ని నిర్వహించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలుస్తోంది. చట్టప్రకారం జరగాల్సిన పంపకాలు పూర్తి కాకపోవడం పైన ఇరువురు ముఖ్యమంత్రులు దృష్టి సారించారు. విభజన సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వాల వైఫల్యం గతంలో తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పాలన సాగించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ఈ రెండు పార్టీల మధ్య సంబంధాలు ఉన్నప్పటికీ విభజన అంశాల పైన ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు సానుకూలమైన చర్చలు జరిపి ప్రయోజనాలను సాధించలేకపోయాయి. కానీ ప్రస్తుతం ఉన్న రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఇరువురు ముఖ్యమంత్రులు సామరస్య పూర్వకంగా సమస్యలను పరిష్కరించడం పైన దృష్టి సారించి భేటీ అవుతున్నారు. సీఎంల భేటీ చర్చించాల్సిన ఎజండా తదితర అంసాలపై ఇరు రాషఅ్ట్రాల అధికారుల మధ్య సంప్రదింపులు జరుగుతున్నాయి. సంప్రదింపుల అనంతరం భేటీ తేదీ, స్థలం అధికారింగా వెల్లడి కానుంది.



## అమెరికా వద్దు.. మా దేశానికి రండి

### భారతీయులకు 85 వేల వీసాలిచ్చిన చైనా

**మహా:** అమెరికాలో వలసదారులపై ట్రంప్ ఉరుముతున్నారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత వలసదారుల్ని స్వదేశాలకు పంపేయడంతో పాటు కొత్తగా జారీ చేసే వీసాలు, గ్రీన్ కార్డులపై ఆంక్షలు విధిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికాకు వెళ్లాలంటేనే భారతీయులు భయపడుతున్నారు. ఇప్పటికే అమెరికాలో ఉన్నవారు సైతం ఆందోళనలో ఉన్నారు. ఇలాంటి సమయంలో అమెరికాతో వాణిజ్య యుద్ధానికి సై అంటే సై అంటున్న మన పొరుగుదేశం చైనా మాత్రం భారతీయులకు ఆహ్వానం పలుకుతోంది. ఈ ఏడాది ఇప్పటివరకూ చైనా.. భారతీయులకు 85 వేల వీసాలు జారీ చేసింది. ఈ విషయాన్ని భారత్ లో చైనా రాయబారి జూ ఫీహాంగ్ అధికారికంగా వెల్లడించారు. అంతే కాదు చైనాను సందర్శించడానికి మరింత మంది భారత స్నేహితులకు స్వాగతం అంటూ ఎక్స్ లో పెట్టిన పోస్టులో తెలిపారు. సురక్షిత, స్నేహపూర్వక, స్ఫూర్తివంతమైన చైనాను అన్వేషించండి అంటూ పేర్కొన్నారు. దీంతో భారతీయులు చైనాకు క్యూ కట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## విజయశాంతి దంపతులకు బెదిరింపు మెసేజ్‌లు

### బంజారాహిల్స్ పీఎస్ లో ఫిర్యాదు

### చంద్రకిరణ్ రెడ్డిపై ఫిర్యాదు చేసిన విజయశాంతి భర్త శ్రీనివాస ప్రసాద్



**మహా :** సినీ నటి, ఎమ్మెల్సీ విజయశాంతి దంపతులకు బెదిరింపు సందేశాలు వచ్చాయి. చంద్రకిరణ్ రెడ్డి అనే వ్యక్తి బెదిరింపు సందేశం పంపాడని, బకాయిలు తీర్చకుంటే మీరే శత్రువులు అవుతారని మెసేజ్ చేశాడని విజయశాంతి భర్త శ్రీనివాస ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమోదయోగ్యంకాని రీతిలో మెసేజ్‌లు ఉన్నాయని, అతడిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు బెదిరింపులకు పాల్పడిన చంద్రశేఖర్ రెడ్డిపై బీఎన్ఎస్ యాక్ట్ 35(12), 351(3) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నాలుగేళ్ల క్రితం చంద్రకిరణ్ రెడ్డి అనే వ్యక్తి తమను సంప్రదించినట్లు విజయశాంతి భర్త తెలిపారు. చంద్ర కిరణ్ రెడ్డి సోషల్ మీడియాలో కంటెంట్ క్రియేటర్‌గా పరిచయం చేసుకున్నాడని, విజయశాంతి వద్ద సోషల్ మీడియా హ్యాండ్లర్‌గా అవకాశం ఇవ్వాలని కోరినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, చంద్ర కిరణ్ రెడ్డి తమతో కలిసి పనిచేస్తూనే సొంత వ్యాపారాన్ని బలపరుచుకున్నాడని, స్వలబ్ధి కోసం తమ పేరును వాడుకున్నాడని చెప్పారు. పనితీరు నచ్చకపోవడంతోనే చంద్రకిరణ్ సేవలను ఉపయోగించుకోలేదని శ్రీనివాస ప్రసాద్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాము బీజేపీలో ఉన్నప్పుడు చంద్రకిరణ్‌తో పరిచయం ఏర్పడిందని.. బీజేపీలో ఎదిగేందుకు అతను తమను వాడుకున్నట్లు శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. బీజేపీ నుంచి బయటికి వచ్చాక చంద్రకిరణ్ రెడ్డి నుంచి మెసేజ్ వచ్చిందని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న నగదు చెల్లింపులు చేయగలరా? అని చంద్రకిరణ్ ఏప్రిల్ 06 వ తేదీన మెసేజ్ పంపాడని, దానికి బదులుగా తాము బకాయిలు ఏమీ లేవని సమాధానమిచ్చినట్లు శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే చంద్రకిరణ్ రెడ్డి బెదిరింపులకు పాల్పడ్డాడని చెప్పారు.

## మా సంస్థపై కావాలనే సీపీఎం నాయకులు

### అసత్య ఆరోపణలు చేస్తుండ్రు

### జీనియస్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ వెల్లడి

**అబ్దుల్లాపూర్ మెట్,మహా:** మా సంస్థపై కావాలనే కొంతమంది సిపిఎం నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని జీనియస్ కన్స్ట్రక్షన్స్ సంస్థ మేనేజ్మెంట్ ఒక ప్రకటనలో వెల్లడించింది. రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్మెట్ మండలం, అనాజ్ పూర్ గ్రామంలో ఉన్న ఇందిరమ్మ సాగర్, వేముల కత్వా యొక్క ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను మా జీనియస్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఆక్రమిస్తుందని కొంతమంది సిపిఎం నాయకులు పరిశీలించి ఆరోపించారు. చేసిన ఆరోపణలు అవాస్తవం అన్నారు. వారు చేసిన ఆరోపణలన్నీ పూర్తిగా ఆవాస్తవం అన్నారు... మేము ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని చెప్పారు. ఆక్రమించుకోవాల్సిన అవసరం మా సంస్థకు లేదని జీనియస్ సంస్థ పేర్కొంది. అనాజ్‌పూర్ గ్రామంలోని ఇందిరమ్మ సాగర్, వేముల కత్వాల వరకు ఉన్న మా పట్టా భూములకు సంబంధించి రెవెన్యూ అధికారులు ఇచ్చిన సర్వే మ్యాప్ ప్రకారమే మా యొక్క భూమికి సరిహద్దులు ఏర్పాటు చేసుకొని చదును చేస్తున్నామని సంస్థ తెలిపింది. ఈ విషయం అర్థంకాక కొంతమంది కావాలనే మా యొక్క సంస్థకు చెడ్డ పేరు వచ్చే విధంగా అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు.

## విద్యతోనే ప్రపంచాన్ని జయించవచ్చు

### తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

### అశోక గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ అశోక స్కూల్ ఆఫ్ బిజినెస్ వార్షిక స్నాతకోత్సవంలో పాల్గొన్న పట్టాలు అందజేత




**అబ్దుల్లాపూర్మెట్, ఏప్రిల్ 12:** విద్యతోనే ప్రతి ఒక్కరూ ప్రపంచాన్ని జయించవచ్చునని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ అన్నారు. అశోక గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ లో భాగమైన అశోక స్కూల్ ఆఫ్ బిజినెస్ స్నాతకోత్సవం శనివారం చౌటుప్పల్ పరిధి తుర్కాన్‌పేట ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథులుగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జ్యోతిప్రజ్వలన చేసిన ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ... విద్యతోనే ప్రతి ఒక్కరూ ప్రపంచాన్ని జయించవచ్చునని అన్నారు. ఇంజనీరింగ్ విద్యలో నేర్చుకున్న స్కిల్స్ వల్ల భవిష్యత్తులో మార్కెట్లో ఉపయోగపడుతుందన్నారు. ప్రపంచంతో పోటీపడే ఏ విద్య అయినా కూడా కళాశాలలో ఉండడంతో భవిష్యత్ తరాలకు కొత్త టెక్నాలజీని రూపొందించుకుంటున్నారన్నారు. అశోక ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్కిటెక్చర్ విద్యా అనేకది దేశానికి తలమానికంగా ఉందన్నారు. ఎడ్యుకేషన్ అనేది ప్రతి మనిషిలో పర్ఫెక్షన్, సామాజిక బాధ్యతను తెలియజేశారు. ప్రపంచం రోజురోజుకు కొత్త టెక్నాలజీలతో అప్డేట్ అవుతుండడంతో ప్రతి విద్యార్థి దానికి అనుగుణంగా అప్డేట్ కావాలని స్టూడెంట్స్ కు సూచించారు. ఇంటర్నెట్ ఉపయోగం ద్వారా విద్యా నేర్చుకోవడం కాదు.. ఇంటర్నెట్ లోకి మనం ఎలా వెళ్లాలన్నదే టెక్నాలజీ ద్వారా విద్యార్థులు నేర్చుకోవాలని అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చెప్పినట్లు ముందు మనం మనగురించి ఆలోచించి.. తరువాత ప్రపంచం గురించి మనం ఏమీ చేస్తామన్న విధానాన్ని అశోక గ్రూప్ ఆఫ్ స్కూల్ నేర్పిస్తుందన్నారు. ప్రపంచంలో ఇండియా నుంచి ఎదిగిన సుందర్ పిచ్చై, నారాయణమూర్తి, గ్లోబల్ లోనే గొప్ప వ్యక్తులని అన్నారు. వారు కమిట్మెంట్ వలనే వారు ఆస్థాయికి వెళ్లారని... ప్రతి విద్యార్థి కూడా ఒక కమిట్ మెంట్ ముందుకుసాగాలని తెలిపారు. విద్యార్థులుగా మీ కృషి, గురువుల మద్దతు, కుటుంబ సభ్యుల ప్రేమ మీ నిర్మితమైన ఒక మైలురాయిని దాటుతున్నారని తెలిపారు. లీడర్ అంటే లెర్నింగ్, ఎథిక్ అడప్టాబిలిటీ అన్నారు.

**విద్యార్థులకు అభినందనలు చైర్మన్**

అశోక స్కూల్ ఆఫ్ బిజినెస్ చైర్మన్ అశోక్ నోముల మాట్లాడుతూ... ముందుగా విద్యార్థులకు అభినందనలు తెలిపారు. మన విద్యార్థులు ఉన్నత స్థాయిల్లోకి వెళ్తుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. బిజినెస్ స్కూల్ పురోగతిని వివరించారు. ఇరాన్ కాన్సుల్ జరల్ మహీ షరోఖీ మాట్లాడుతూ... భారత ఇరాన్ విద్యా వ్యాపార సంబంధాలపై మాట్లాడారు. అంతర్జాతీయ అవకాశాలు అన్వేషించాలని విద్యార్థులకు సూచించారు. డెలాయిట్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సందీప్ శర్మ మాట్లాడుతూ... ఉద్యోగ జీవితంలో మార్గదర్శక నిబంధనలు, ఉత్తమ ప్రవర్తన, కమ్యూనికేషన్ ప్రాముఖ్యతను వివరించారు. అశోక స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ వై. లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. పీజీడీఎం కోర్సు విజయాలు ఇంటర్నేషన్ ఇమ్మర్షన్ ప్రోగ్రాం. అనేక పరిశోధనలు, ప్లేస్‌మెంట్ గురించి వివరించారు. ప్రముఖ కంపెనీలు టెక్ మహీంద్ర, ఐబీఎం, ఈవై, జెన్ షార్ట్ మొదలైనవి ప్లేస్ మెంట్ ఇచ్చాయని తెలిపారు. అనంతరం గవర్నర్ విద్యార్థులకు పీజీడీఎం విద్యార్థులకు పట్టాలు అందజేశారు. పీజీడీఎం విభాగంలో ఏ హైందవి (2022), ఎస్ శివాజీ (2023), పీ హైమవతి (2024) రితికా నితిన్ కులకర్ణి (2024) పీజీడీఎం (ఏఐ & డీఎస్) విభాగంలో బంగారు పథకాలతో గవర్నర్ సత్కరించి.. సర్టిఫికెట్లు అందజేశారు. 97 మంది విద్యార్తులకు, డిప్లొమా ప్రదానం చేయగా... అందులో 45 మంది విద్యార్థినులు ఉన్నారని తెలిపారు. అంతకు ముందే అనంత పేరుతో కొత్త గ్రందాలయ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 8.3లక్షల చదరపు అడుగల విస్తీర్ణంలో నూతన క్యాంప్ ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అశోక విద్యాసంస్థల లెక్చలర్స్, విద్యార్థులు, విద్యార్థునుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌పై మండిపడ్డ కేటీఆర్

### రజతోత్సవ సభకు అనుమతివ్వలేదని ఆరోపణ

**మహా:** 2025 సంవత్సరం బీఆర్ఎస్ పార్టీకి కీలకమని పేర్కొన్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కరీంనగర్ ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభకు ఇప్పటివరకు పోలీసులు అనుమతులు ఇవ్వలేదని ఆరోపించారు. మార్చి 28న అనుమతికి అప్లై చేసినప్పటికీ ఇంకా ప్రతిస్పందన లేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవానికి ప్రతీకగా బీఆర్ఎస్ పార్టీ నిలిచిందని, రాష్ట్రం రూపుదిద్దుకునే దశలో పుట్టిన ఈ పార్టీ ఇప్పటికి అరవై లక్షల సభ్యులను కలిగి ఉందన్నారు. “రజతోత్సవం ప్రభుత్వానికి విరుద్ధంగా నిర్వహించే సభ కాదు, ఇది మేం ప్రతి సంవత్సరం జరుపుకునే వార్షికోత్సవ సభ మాత్రమే,” అని స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్సుల కోసం ఇప్పటికే రూ.10 కోట్లను చెల్లించామని, ఈ సభ అనంతరం ఏడాది పాటు రజతోత్సవ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. కంచె గచ్చిబౌలి భూముల వివాదాన్ని ప్రస్తావించిన కేటీఆర్, “ఆ భూములను ఎవరైనా కొనుగోలు చేస్తే మేము అధికారంలోకి వచ్చాక తిరిగి రికవరీ చేస్తాం” అని హెచ్చరించారు.

## ఇందిరమ్మ ఇండ్లపై సీఎం సమీక్ష

**హైదరాబాద్, మహా :** ఇందిరమ్మ ఇండ్లు పథకం కింద మొదటి దశలో అత్యంత నిరుపేదలకు, అర్హులకు మాత్రమే గృహాలను కేటాయించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ పథకం పారదర్శకంగా, నిరుపేదలకు న్యాయం చేసేలా అమలు కావాలని ఉద్ఘాటించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తో కలిసి ఇందిరమ్మ ఇండ్లపై ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి అధికారులకు కీలక సూచనలు చేశారు. "ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలు అత్యంత జాగ్రత్తగా పనిచేయాలి. కమిటీలు తయారు చేసిన అర్హుల జాబితాను తహాశీల్దార్, ఎంపీడీవో, ఇంజినీర్‌లతో కూడిన మండల స్థాయి బృందం క్షేత్రస్థాయిలో స్వయంగా తనిఖీ చేసి, ధృవీకరించాలి. ఒకవేళ అనర్హులకు ఇండ్లు కేటాయించబడినట్లు తేలితే, వెంటనే ఇందిరమ్మ కమిటీకి తెలియజేసి, ఆ స్థానంలో అర్హులైన వారికి గృహం మంజూరు చేయాలి. పథకంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలి. దందాలకు పాల్పడే వారిపై తక్షణమే కేసులు నమోదు చేయాలి. అనర్హులు ఇండ్లు నిర్మించుకున్నట్లు తేలితే చట్టపరమైన చర్యలతో పాటు, వారు పొందిన నిధులను వసూలు చేయాలి.

లబ్ధిదారుల సౌకర్యం కోసం అదనపు సదుపాయాలను కల్పించాలి. గృహ నిర్మాణంలో లబ్ధిదారులు తమ అవసరాలకు అనుగుణంగా 50 శాతం అదనపు స్థలాన్ని నిర్మించుకునే అవకాశం కల్పించాలి. ఇందిరమ్మ ఇండ్లకు సిమెంట్, స్టీల్ వంటి నిర్మాణ సామగ్రిని సరసమైన ధరలకు అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపే లక్ష్యంతో రూపొందింది కాబట్టి ఈ పథకం అమలులో పారదర్శకత, నిజాయితీ ప్రధానంగా ఉండాలి. అర్హులైన వారికి మాత్రమే ఈ గృహాలు దక్కేలా చూడాలి" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## కాంగ్రెస్ కు మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్ రాజీనామా

### ఆర్ఎల్ డిలో చేరిక

**ఢిల్లీ, మహా:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీలో ఆయన చేశారు. అధ్యక్షుడు జయంత్ చౌదరి సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. దిలీప్ కుమార్ ను తెలంగాణతో పాటు మహారాష్ట్ర ఇన్చార్జిగా నియమిస్తూ జయంత్ చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేసిన దిలీప్ గత ఎన్నికలకు కొన్ని రోజుల ముందు బిజెపి నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే.. కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై పలు ఇంటర్వ్యూల్లో అసంతృప్తి వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు.

## మాకు ఆస్తులు లేవు

### స్మితా సబర్వాల్, యోగితా రాణా, జయేష్ రంజన్ సహా పలువురు అఫిడవిట్లు

### నిబంధనల ప్రకారం డిఓపీటీకి వివరాలు

### రాష్ట్రంలోని 174 మంది ఐఏఎస్ లు, 128 మంది ఐపీఎస్ లు



**హైదరాబాద్, మహా :** డీవోపీటీ (డిపార్ట్ మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్)కి తెలంగాణకు చెందిన పలువురు ఐఏఎస్ లు, ఐపిఎస్ లు ఆస్తులపై అఫిడవిట్లు సమర్పించారు. తమకు ఆస్తుల్లేవని స్మితా సబర్వాల్, యోగితారాణా, జయేశ్ రంజన్, క్రిస్టినా జడ్ చోంగ్తూ, సంజయ్ జాజూ, స్టీఫెన్ రవీంద్ర సహా పలువురు అధికారులు పేర్కొనగా, తెలంగాణ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తనకు హైదరాబాద్ లోని జూబ్లీ హిల్స్ ప్రశాసన్ నగర్ లో ఒక ఇల్లు ఉందని తెలిపారు. సీవీ ఆనంద్, అవినాష్ మహంతి కూడా వారసత్వపు ఆస్తులున్నాయని రికార్డుల్లో సూచించారు. ఐపీఎస్ అధికారి డీజీపీ జితేందర్ తనకు తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా ఆస్తులు వచ్చాయని తెలిపారు. చాలా మంది ఐపీఎస్ అధికారుల ఆస్తులు తల్లిదండ్రుల లేదా వారసత్వంగా వచ్చిన ఆస్తులున్నాయని డీవోపీటీకి వెల్లడించినట్లు తెలిపింది.

EDITORIAL
సంపాదకీయం

# మోదీ తర్వాత ఎవరు?

**మోదీ 75 పై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. మోదీ రిటైర్మెంట్ తీసుకుంటారా లేదా? తానే తీసుకొచ్చిన 75 ఏళ్ళ నిబంధన పక్కనబెడతారా? అన్నది దేశప్రజలు ఎదురుచూస్తున్న ఆసక్తికర పరిణామం. ఒకవైపు నరేంద్ర మోదీపై సంఘ్ ఆగ్రహంగా ఉందన్న సంకేతాలు, మరోవైపు జాతీయ రాజకీయాల్లో రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్ వంటి నేతల ఎదుగుదల, మోదీకి వయసు పైబడుతుండడం, ప్రజల సెంటిమెంట్‌లో మార్పు, మిత్రపక్షాల మద్దతుతో మోదీ ప్రభుత్వం నడుస్తుండడం వంటి విషయాలన్నీ ఈ ఏడాది తీసుకోబోయే నిర్ణయంపై ప్రభావం చూపనున్నాయి. రాజకీయ ఒలింపిక్స్‌లో రేసులో కనిపించని క్రీడాకారులు కూడా బంగారు పతకాలు సాధిస్తారు. ఇపుడు కాకుంటే.. తర్వాతైనా మోదీకి వారసుడి రావాల్సిందే. మోదీ వారసుడి ఎంపికపై సంఘ్ మొదలుపెట్టిన సన్నాహాల వెనుక దీర్ఘకాల వ్యూహం కనబడుతోంది. - తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సీఈవో జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్



> 2014లో నరేంద్ర మోదీ ప్రధాని అయినప్పుడు ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషి వంటి అగ్రనేతలకు పార్లమెంటరీ బోర్డులో కానీ, మంత్రివర్గంలో కానీ చోటు కల్పించలేదు. మార్గదర్శక మండలిలో మాత్రమే ఈ ఇద్దరు నేతలకు చోటుదక్కింది. ఆ సమయంలో అద్వానీకి 86 ఏళ్లు కాగా, జోషికి 80 ఏళ్లు. ఆ నిబంధనతో ఒక్క కేంద్రంలోనే కాదు.. బిజెపి పాలిత రాష్ట్రాల్లో అనేకమంది నేతలు మంత్రి పదవులు కూడా కోల్పోయారు. ఒక్క యడ్యూరప్ప విషయంలో తప్ప దాదాపుగా ఈ నిబంధన గత పదేళ్ళకు పైగా చలామణిలో ఉంది. మోదీ, షా ద్వయం ఈ నిబంధన ద్వారానే.. పార్టీలోని అన్నిస్థాయిల్లో తమ వర్గాన్ని పెంచుకుంది.

> రాజకీయ ఒలింపిక్స్‌లో రేసులో కనిపించని క్రీడాకారులు కూడా బంగారు పతకాలు సాధిస్తారు. రాజకీయ అంశాల్లో ఇప్పుడు మతం వెనకబడి, కులం ముందుకు వచ్చినట్లు కనిపిస్తోంది. బీజేపీని మోదీ, షా తమ మనుషులతో నింపేశారు. వాళ్లు గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ముందుకు వెళ్లనీయరని బిజెపి సన్నిహితవర్గాలు చెబుతున్నాయి. బిజెపి విజయాల్లో అమిత్ షా పాత్ర అనిర్వచనీయమైనది. మోదీ 75 ఏళ్లకు ఉన్న రాజకీయ ప్రాధాన్యం ఏంటో గత ఏడాదికాలంగా జరుగుతున్న పరిణామాలు, ఎదురవుతున్న ప్రశ్నలు చెబుతున్నాయి.

> నంబర్ వన్ స్థానం కోసం ఇప్పటికీ పోటీలేదు. అయితే ఆ దిశగా అన్వేషణ ఇప్పటికే ప్రారంభమైంది. సంఘ్‌ని పరిశీలిస్తే దీర్ఘకాలం మనగలిగే విధానాలు, నిర్ణయాలకే మొగ్గుచూపుతారు. దీర్ఘకాలిక విధానాల రూపకల్పనలో వారు నిమగ్నమయ్యారు. ప్రధాన మంత్రి మోదీతో పాటు మరో నాయకత్వం కోసం సంఘ్ చూస్తోంది.

మోదీ రిటైర్మెంట్ పై ఇపుడు దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఇపుడు లోక్ సభ ఎన్నికలు లేవు. ఈ ఏడాది ఒక్క బిహార్ మినహా ఏ రాష్ట్రంలోనూ ఎన్నికలు లేవు. జరగాల్సినవి జరిగిపోయాయి. సెప్టెంబర్ 17న మోదీ బర్త్ డే. మోదీకి 75 ఏళ్ళు వచ్చిన నేపథ్యంలో గతంలో మోదీ తీసుకొచ్చిన ఫార్ములా ప్రకారం రిటైర్ అవుతారా? లేక కొనసాగుతారా? కొనసాగితే ఎంతకాలం... ఎపుడో ఓ సారి మోదీకి వారసుడు రావాల్సిందే కదా? ఇదీ బిజెపి కోర్ గ్రూప్, ఆర్ఎస్ఎస్ వర్గాల్లో జరుగుతున్న చర్చ. 2024 లోక్ సభ ఎన్నికల ముందు కూడా ఇదే తరహా చర్చ జరిగింది. ప్రధాని ఎవరు అన్న ప్రశ్నలకు.. అమిత్ షా లాంటి నేతలు అనేక సమాధానాలు చెప్పినా, ఇప్పటికీ 75లోకి అడుగుపెట్టిన వేళ నాగ్ పూర్ కేంద్రం నుండి వచ్చే సంకేతం ఏంటి అన్న ఉత్కంఠ దేశవ్యాప్తంగా ఉంది. మహారాష్ట్ర, ఢిల్లీ విజయంలో ఆర్ఎస్ఎస్ పాత్ర కీలకం. ఇపుడు మోదీ వారసుడి ఎంపిక ఢిల్లీలో కంటే నాగ్ పూర్ ఆర్ఎస్ఎస్ హెడ్ క్వార్టర్స్ లోనే జరుగుతుందన్న విషయం అందరికీ తెలిసిందే. 2014లో నరేంద్ర మోదీ ప్రధాని అయినప్పుడు ఎల్‌కే అద్వాణీ, మురళీ మనోహర్ జోషి వంటి అగ్రనేతలకు పార్లమెంటరీ బోర్డులో కానీ, మంత్రివర్గంలో కానీ చోటు కల్పించలేదు. మార్గదర్శక మండలిలో మాత్రమే ఈ ఇద్దరు నేతలకు చోటుదక్కింది. ఆ సమయంలో అద్వాణీకి 86 ఏళ్లు కాగా, జోషికి 80 ఏళ్లు. ఆ నిబంధనతో ఒక్క కేంద్రంలోనే కాదు.. బిజెపి పాలిత రాష్ట్రాల్లో అనేక మంది నేతలు మంత్రి పదవులు కూడా కోల్పోయారు. ఒక్క యడ్యూరప్ప విషయంలో తప్ప దాదాపుగా ఈ నిబంధన గత పదేళ్ళకు పైగా చలామణిలో ఉంది. మోదీ, షా ద్వయం ఈ నిబంధన ద్వారానే.. పార్టీలోని అన్ని స్థాయిల్లో తమ వర్గాన్ని పెంచుకుంది. ఇపుడు అసలు సమయం రానే వచ్చింది. ఇది మోదీకి పరీక్ష. ఎంతోకాలంగా ఆ పదవిపై ఆశలు పెంచుకున్న అమిత్ షాకు ఉత్కంఠ. ఇండియాలో నెంబర్ 2 అంటే అమిత్ షానే అన్న విషయం అందరికీ తెలుసు. అయితే నెంబర్ 2 నుండి నెంబర్ వన్ కావడం అంత తేలికైన వ్యవహారం కాదు.

**75 ఏళ్ల రూల్ మోదీ పాటిస్తారా?**


''75 ఏళ్ల ఈ రూల్ తీసుకొచ్చింది మోదీ కాబట్టి, ఆయన పాటిస్తారా లేదా అనేది ఆయన ఇష్టం'' అని ఒకప్పుడు మోదీ ఎన్నికల ప్రచారకర్తగా పనిచేసిన ప్రశాంత్ కిషోర్ చెప్పారు. 'ప్రస్తుతం నరేంద్ర మోదీ చాలా యాక్టివ్‌గా ఉన్నారు, 2029 వరకూ పగ్గాలు నరేంద్ర మోదీ చేతిలోనే ఉండవచ్చు. లేదా ఉండకపోవొచ్చు. కానీ రాజకీయాల్లో అనిశ్చితి ఉంది. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల వ్యవహారంలో దేనికైనా సన్నాహాలు చాలా ముందునుంచే మొదలవుతాయి . నంబర్ వన్ స్థానం కోసం ఇప్పటికీ పోటీలేదు. అయితే ఆ దిశగా అన్వేషణ ఇప్పటికే ప్రారంభమైంది. సంఘ్‌ని పరిశీలిస్తే దీర్ఘకాలం మనగలిగే విధానాలు, నిర్ణయాలకే మొగ్గుచూపుతారు. దీర్ఘకాలిక విధానాల రూపకల్పనలో వారు నిమగ్నమయ్యారు. ప్రధాన మంత్రి మోదీతో పాటు మరో నాయకత్వం కోసం సంఘ్ చూస్తోంది. ఆ దిశగా కార్యాచరణ మొదలైంది.

**మోదీ సంఘ్ మధ్య దూరం**


ఒకవైపు నరేంద్ర మోదీపై సంఘ్ ఆగ్రహంగా ఉందన్న సంకేతాలు, మరోవైపు జాతీయ రాజకీయాల్లో రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్ వంటి నేతల ఎదుగుదల, మోదీకి వయసు పైబడుతుండడం, ప్రజల సెంటిమెంట్‌లో మార్పు, మిత్రపక్షాల మద్దతుతో మోదీ ప్రభుత్వం నడుస్తుండడం వంటి విషయాలన్నీ ఈ ఏడాది తీసుకోబోయే నిర్ణయంపై ప్రభావం చూపుతున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ తర్వాత జాతీయ రాజకీయాల్లో ఖచ్చితంగా మార్పులు ఉండే అవకాశాలున్నాయి. మోదీని ఈ టర్మ్ వరకు కొనసాగిస్తే పాలనాపరంగా మరిన్ని సంచలనాలు నమోదయ్యే అవకాశాలుండవచ్చు.

నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ వంటి అనేక సంచలనాలు తెరముందుకు రావొచ్చు. ఇక రిటైర్మెంట్ దిశగా నిర్ణయం తీసుకుంటే.. అది మరింత పెద్ద సంచలనమవుతుంది. మోదీ వారసుడి ఎంపిక, బిజెపిలో మార్పులు.. కేంద్ర సర్కారులో మార్పులు కొత్త పరిణామాలకు దారి తీయవచ్చు. అయితే ఏం జరుగుతుందనేది నాగ్ పూర్ కేంద్రానికి, ప్రధాని మోదీకి స్పష్టత ఉంది. లోక్ సభ ఎన్నికల తర్వాత బిజెపి జాతీయ అధ్యక్షుడు నడ్డా ఇపుడు బిజెపి బలపడింది కాబట్టి సంఘ్ మీద అంత ఆధారపడాల్సిన అవసరం లేదన్నట్లు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. తర్వాత నితీష్ కుమార్ కూడా బిజెపి పార్లమెంటరీ పార్టీ నేత మోదీకి మా మద్దతునిస్తున్నాం అంటూ ప్రకటించారు. అసలు బిజెపి పార్లమెంటరీ పార్టీ సమావేశం ఎపుడు జరిగిందంటూ ఆర్ ఎస్ ఎస్ ఆశ్చర్యపోయింది. సంఘ్ గుర్తుతో బిజెపి పార్లమెంటరీ పార్టీ సమావేశం జరగకుండానే ఎన్డీఏ సమావేశం జరిగి ప్రధానమంత్రి ఎన్నిక అయిపోయింది. సెప్టెంబర్ తర్వాత కూడా మోదీ ఏకపక్షంగా కొనసాగడం, ఇంతకుముందులా పాలన సాగించడం తేలికైన వ్యవహారం కాదు. రాజకీయ ఒలింపిక్స్‌లో రేసులో కనిపించని క్రీడాకారులు కూడా బంగారు పతకాలు సాధిస్తారు. రాజకీయ అంశాల్లో ఇప్పుడు మతం వెనకబడి, కులం ముందుకు వచ్చినట్లు కనిపిస్తోంది. లోక్ సభ ఎన్నికల తరహాలో కరుడుగట్టిన హిందుత్వ వాదం తగ్గి బీజేపీ పతనం కొనసాగితే, మోదీ, యోగి ఆదరణ కూడా తగ్గడం మొదలవుతుంది. ఒకవేళ పరిస్థితులు అలా మారిపోతే, సంఘ్ మూడో వ్యక్తిని కూడా తెరమీదకు తీసుకురావొచ్చు. బీజేపీని మోదీ, షా తమ మనుషులతో నింపేశారు. వాళ్లు గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ముందుకు వెళ్లనీయరని బిజెపి సన్నిహితవర్గాలు చెబుతున్నాయి. బిజెపి విజయాల్లో అమిత్ షా పాత్ర అనిర్వచనీయమైనది. మరి ఈ చాణక్యుడు.. ఆ పదవిని కైవసం చేసుకోవడానికి ఏం చేస్తాడు? అన్నది ఆసక్తికరమే. మోదీ 75 ఏళ్లకు ఉన్న రాజకీయ ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవడానికి గత ఏడాదికాలంగా జరుగుతున్న పరిణామాలు, ఎదురవుతున్న ప్రశ్నలు చాలు. భారతదేశం పైనే కాదు.. ప్రపంచంపై మోదీ వేసిన ముద్ర బలీయమైనది. మరి మోదీ 75 ఉత్సవమా.. ఉద్వేగమా అన్నదానికి కాలమే సమాధానం చెప్పనుంది.

## ఏఐ ఆటోమేటెడ్ IVF సిస్టమ్‌తో బిడ్డకు జన్మ..
# ప్రపంచంలో ఇదే మొదటిసారి



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వైద్య రంగంలో కూడా అద్భుతాలు సృష్టిస్తోంది. తాజాగా AIతో నడిచే పూర్తిగా ఆటోమేటెడ్ IVF సిస్టమ్ ద్వారా ఆరోగ్యకరమైన మగ శిశువు జన్మించాడు. ఈ అడ్వాన్స్‌డ్ సిస్టమ్‌లో, ఫలదీకరణంలో ప్రతి దశను మానవ చేతులకు బదులుగా మెషీన్స్ హ్యాండిల్ చేశాయి. ప్రపంచంలో ఇలా ఓ శిశువు జన్మించడం ఇదే మొదటిసారి. ఇంట్రాసైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్ (ICSI)గా పేర్కొనే సాధారణ IVF టెక్నాలజీని ఈ సిస్టమ్ రీప్లేస్ చేస్తుంది. ఇంట్రాసైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్‌లో ఒక స్పెషలిస్ట్ మైక్రోస్కోప్, అడ్వాన్స్‌డ్, స్మాల్ టూల్స్ ఉపయోగించి ఒకే స్పెర్మ్‌ను నేరుగా అండంలోకి ఇంజెక్ట్ చేస్తారు. ఈ పద్ధతి 1990ల నుంచి ఉంది. సాధారణంగా ఈ ప్రాసెస్, ట్రైనింగ్ తీసుకున్న ఎంబ్రియాలజిస్ట్(Embryologists)ల అనుభవం, నైపుణ్యాలపై ఆధారపడి ఉంటుంది. కానీ ఏదైనా మానవ లోపాలు ఫలితాన్ని ప్రభావితం చేసే ప్రమాదం ఉండనే ఉంటుంది. ఇప్పుడు శాస్త్రవేత్తల బృందం ICSI ప్రాసెస్‌లో 23 దశలను ఆటోమేటిక్‌గా చేసే సిస్టమ్‌ను క్రియేట్ చేసింది. ఇది సరైన స్పెర్మ్‌ను ఎంచుకోవడం నుంచి అండంలోకి ఇంజెక్ట్ చేయడం వరకు ప్రతిదీ చేయడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్ టూల్స్ ఉపయోగిస్తుంది. ఈ కొత్త పద్ధతిని ఏఐ ద్వారా ఆపరేట్ చేయవచ్చు లేదా రిమోట్‌గా కూడా కంట్రోల్ చేయవచ్చు. అమెరికాలో న్యూయార్క్, మెక్సికోలోని గ్వాడలజారాలోని కన్సీవబుల్ లైఫ్ సైన్సెస్ పరిశోధకులు, ఎంబ్రియాలజిస్ట్ డాక్టర్ జాక్వెస్ కోహెన్ నేతృత్వంలో ఈ డెవలప్‌మెంట్ సాధించారు. ఈ పరిశోధన ఫలితాలు రిప్రొడక్టివ్ బయోమెడిసిన్ (Reproductive BioMedicine) అనే ఆన్‌లైన్ జర్నల్‌లో పబ్లిష్ అయ్యాయి. గ్వాడలజారాలోని హోప్ IVF మెక్సికోలో ప్రసవం జరిగింది. ఆ మహిళకు 40 ఏళ్లు. గతంలో చేసిన ప్రయత్నం విఫలమైన తర్వాత దాత అండాలతో IVF చేయించుకుంది. AI సిస్టమ్‌ను ఉపయోగించి ఫలదీకరణం చేసిన ఐదు అండాలలో, నాలుగు విజయవంతంగా ఫలదీకరణం చెందాయి. వాటిలో ఒకటి ఆరోగ్యకరమైన పిండంగా అభివృద్ధి చెందింది. దాన్ని ఫ్రోజెన్ చేసి తరువాత తల్లి గర్భాశయంలోకి ప్రవేశపెట్టారు. ప్రక్రియ అంతా విజయవంతం అయి ఆమె పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిస్టమ్ ఫలదీకరణంలోని ప్రతి అంశాన్ని హ్యాండిల్ చేసింది. AIని ఉపయోగించి బెస్ట్ స్పెర్మ్‌ను సెలక్ట్ చేసుకుంది. లేజర్‌తో దానిని స్థిరీకరించింది, అండంలోకి ఇంజెక్ట్ చేసింది. ఇవన్నీ కచ్చితత్వంతో పూర్తి చేసింది. ఇప్పటి వరకు ఉన్న IVF పద్ధతులను ఇది సమూలంగా మార్చగలదని డాక్టర్ కోహెన్ అన్నారు. ఈ సిస్టమ్ ల్యాబ్ సిబ్బంది పై ఒత్తిడిని తగ్గిస్తుంది, స్థిరత్వాన్ని పెంచుతుందని.. అండాలు సమృద్ధిగా ఫలదీకరణం చెందేలా చూస్తుందని చెప్పారు. ప్రస్తుతం ఈ ప్రాసెస్‌లో ఒక్కో అండానికి దాదాపు 10 నిమిషాలు పడుతుంది. ఇది మాన్యువల్ పద్ధతి కంటే కొంచెం నెమ్మదిగా ఉంటుంది. కానీ టెక్నాలజీ అడ్వాన్స్ అయ్యే కొద్దీ, ఇది చాలా వేగంగా మారుతుందని నిపుణులు విశ్వసిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో పని చేసిన మరో పరిశోధకుడు డాక్టర్ చావెజ్‌బాడియోలా మాట్లాడుతూ, 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో స్పెర్మ్ ఎంపిక సహా ICSI ప్రతి దశను పూర్తిగా ఆటోమేట్ చేసే మొదటి పద్ధతి ఇదే. ఈ సిస్టమ్ సేఫ్టీ, పనితీరును నిర్ధారించుకోవడానికి మరిన్ని అధ్యయనాలు అవసరం. అయినా మొదటి బిడ్డ జననం ఓ కీలకమైన ముందడుగు.' అని వివరించారు. ఇప్పటికే ఐవీఎఫ్‌లో పిండాలను ఫ్రీజింగ్ చేయడం, పర్యవేక్షించడం వంటి వాటికి ఆటోమేషన్ ఉపయోగిస్తున్నారు. అయితే ఈ లేటెస్ట్ అప్‌డేట్‌తో భవిష్యత్తులో ఫెర్టిలిటీ ట్రీట్‌మెంట్స్ మరింత అభివృద్ధి చెందుతాయని నిపుణులు చెబుతున్నారు.



# వేసవి తాపం.. కావొద్దు శాపం..

**తీవ్రమైన సూర్యతాపం కారణంగా ఎండకాలంలో ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. సెలవుల ఆనందాన్ని ఆస్వాదించాలంటే ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి. డీహైడ్రేషన్ మొదలుకుని ఫుడ్ పాయిజనింగ్ వరకు వేసవిలో మనం జాగ్రత్తగా ఉండాల్సిన అంశాలు ఎన్నో ఉంటాయి. ఈ నేపథ్యంలో ఎండకాలంలో వచ్చే చిక్కులను, వాటి నివారణ గురించి తెలుసుకుందాం.**

**డీహైడ్రేషన్**

ఎండకాలంలో చెమట ఎక్కువగా పడుతుంది. ఈ కారణంగా శరీరం నీళ్లు, మినరల్స్‌ను కోల్పోతుంది. ఇలాంటప్పుడు తగినన్ని నీళ్లు తాగకపోతే డీహైడ్రేషన్ తలెత్తుతుంది. దీంతో తలతిప్పడం, తలనొప్పి, అలసట, చర్మం పొడిబారడం లాంటివి బాధిస్తాయి. కాబట్టి, దాహంగా అనిపించనప్పటికీ రోజంతా వీలైనన్ని సార్లు నీళ్లు తాగుతూ ఉండాలి. పుచ్చకాయ, కీరదోస, నారింజ లాంటివి ఆహారంలో చేర్చుకోవాలి. కెఫీన్, ఆల్కహాల్ మోతాదుకు మించి తీసుకోకూడదు. ఇవి డీహైడ్రేషన్ సమస్యను తీవ్రం చేస్తాయి. ఎండలో బయటికి వెళ్లేటప్పుడు ఓ నీళ్ల బాటిల్ తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలి.

**చర్మ సమస్యలు**

ఎండలో ఎక్కువసేపు ఉంటే చర్మం కందిపోవడం, దద్దుర్లు, చెమటకాయలు సహా ఎన్నో చర్మ సమస్యలు వస్తాయి. అందువల్ల బయటికి వెళ్లేటప్పుడు చర్మానికి ఎస్‌పీఎఫ్ 30, అంతకంటే ఎక్కువ ఉన్న సన్‌స్క్రీన్ లోషన్ అప్లయ్ చేసుకోవాలి. తేలికైన, గాలి ధారాళంగా వచ్చే కాటన్ దుస్తులు ధరించాలి. దీంతో చెమట అంతగా పట్టదు. ఫంగల్ ఇన్ఫెక్షన్లు సోకకుండా చల్లటి నీళ్లతో స్నానం చేయాలి. చర్మం కమిలినప్పుడు చికిత్స కోసం అలోవెరా జెల్ కానీ, ఏదైనా కూలింగ్ మాయిశ్చరైజర్ కానీ వాడాలి.

**మూత్ర సంబంధ ఇన్ఫెక్షన్లు**

డీహైడ్రేషన్, అధిక చెమట మూత్రం పరిమాణాన్ని తగ్గిస్తాయి. ఇది మూత్రనాళంలో బ్యాక్టీరియా ముప్పును పెంచుతుంది. దీంతో మూత్రనాళ ఇన్ఫెక్షన్ల ప్రమాదం పెరుగుతుంది. స్త్రీలు మరీ జాగ్రత్తగా ఉండాలి. శరీరం నుంచి టాక్సిన్లు బయటికి వెళ్లడానికి నీళ్లు, ఫ్లూయిడ్లు తాగుతూ ఉండాలి. పబ్లిక్ టాయిలెట్ ఉపయోగిస్తే ఆ తర్వాత శరీర పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. మూత్రాన్ని ఎక్కువసేపు ఉగ్గబట్టుకోకూడదు. బ్యాక్టీరియా నివారణ కోసం వదులుగా ఉండే కాటన్ అండర్‌వేర్‌ను ధరించడం మంచిది.

**వడదెబ్బ**

ఎండలో ఎక్కువసేపు గడిపితే తలతిప్పడం, వికారం, అధిక చెమట లాంటి సమస్యలు తలెత్తుతాయి. దీంతో చాలామంది వడదెబ్బకు గురవుతారు. ఈ పరిస్థితి రాకుండా ఎండ బాగా ఉండే మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల మధ్య బయటికి వెళ్లకూడదు. ఎలక్ట్రోలైట్లు సమృద్ధిగా ఉండే కొబ్బరినీళ్ల లాంటి ఫ్లూయిడ్స్ తీసుకోవాలి.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

## ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్ లో
# శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రతిభ



**హుజూర్ నగర్,మహా:** నాసా నిర్వహించిన నేషనల్ అవార్డ్స్ ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్ 2025 లో శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు నేషనల్ లెవెల్ సెకండ్ ప్రైజ్ సాధించారు. నేషనల్ సెకండ్ ప్రైజ్ సాధించిన ఐదుగురు విద్యార్థులు సిరి మహేశ్వరి, మోక్షిత, యశ్వంత్, మనోజ్ సాయి , నిఖిలేష్ గౌడ్ లను పాఠశాల డిజిఎం సుధాకర్, ప్రిన్సిపల్ పోసాని వెంకటరమణ, డీన్ ప్రేమ్ సాగర్ శనివారం అభినందించారు.ఇట్టి కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగంలో రాణించేందుకు శ్రీ చైతన్య పాఠశాల కృషి చేస్తుందని విద్యార్థులు చిన్ననాటి నుండే ప్రయోగాల ద్వారా పరిణితి చెందిందుకు ఉపాధ్యాయులు తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు .ఈ కార్యక్రమంలో ప్రియాంక, సాయి కృష్ణ , వేమన ఉపాధ్యాయులు విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు.

## సీఎం సహాయనిధి చెక్కును అందజేసిన
# వార్డ్ ఇంచార్జ్ కోలపుడి యోహాన్



**హుజూర్ నగర్, మహా:** హుజూర్ నగర్ పట్టణంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలతో 14 వ వార్డులో వార్డు ఇంచార్జ్ కోలపూడి యోహాన్ ఆధ్వర్యంలో బాధితుడు సురభి నాగరాజు కుటుంబానికి 45,000 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును వార్డు సభ్యుల చేతుల మీదుగా శనివారం అందించడం జరిగింది. వార్డు అధ్యక్షులు యోహాన్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కంటే ఇప్పుడు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు త్వరగా వస్తున్నాయని గతంలో 30 శాతం ఇస్తే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 40శాతం పేమెంట్ ఇస్తుందని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వార్డు పరిధిలో ఏ కుటుంబంలో ఎవరికి ఏది జరిగినా తప్పనిసరిగా సమాచారం ఇస్తే అందుబాటులో ఉంటామని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి చలువతో రాష్ట్ర ప్రజలందరికీ రేషన్ షాపుల ద్వారా ప్రతి పేదవాడికి సన్న బియ్యం అందించడంతో ప్రజలందరూ సంతోషాలతో పండుగ చేసుకుంటున్నారని వారికి పాలాభిషేకాలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కమిటీ సభ్యులు, పెద్దారపు రామకృష్ణ, దుగ్గి సైదులు, పెద్దలు నమోజు లక్ష్మాచారి, మామిడి అశోక్, కోల్లపూడి ప్రవీణ్,కోల్లపూడి కాంతయ్య, బండి నాగేశ్వరరావు, తుపాకుల శీను, ఇందిరాల రమేష్, ఇందిరాల నాగమణి, మువ్వ బాబు, వల్లభ దాసు నరసింహ, పప్పుల నరసింహ, గొర్రె నరసింహ, కుడితొట్టి నిఖిల్, కోల్లపూడి విక్రమ్ పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహ స్వామివారికి నిత్య కళ్యాణం గరుడసేవ





**హుజూర్ నగర్,మహా:** లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం మట్టపల్లి మహాక్షేత్రం నందు శనివారం స్వామి వారికి నిత్య కళ్యాణం మరియు గరుడ సేవ దేవాలయ అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు , పద్మనాభా చార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి వార్లచే శాస్త్రోతముగా నిర్వహించబడినది. ఇట్టి కళ్యాణంలో పాల్గొన్న దంపతులు హసాన్, గురవయ్య, సీతారామయ్య, టి విశ్వనాథ్, నరసింహమూర్తి, రాజశేఖర్ శర్మ, గోలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నందిపాటి శాంతమ్మ పార్థివదేహానికి
## నివాళులర్పించిన మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**హుజూర్ నగర్, మహా:** సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం వర్ధాపురం గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ మండల సోషల్ మీడియా సభ్యులు నందిపాటి సోమయ్య, నందిపాటి రాజు, మాతృమూర్తి నందిపాటి శాంతమ్మ అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందినారు .విషయం తెలుసుకున్న మఠంపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఇరుగు పిచ్చయ్య మరియు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మఠంపల్లి మాజీ సర్పంచ్ మన్నెం శ్రీనివాస్ రెడ్డిలు వారి ఇంటికి వెళ్లి ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి వారి ఆత్మ నివాళులర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు .ఆయన వెంట వర్ధాపురం గ్రామ అధ్యక్షులు బత్తుల సైదయ్య, మఠంపల్లి మండల



బి ఆర్ ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు పల్లె మట్టయ్య, మజీద్ కమిటీ అధ్యక్షులు పఠాన్ హఫీజ్ ఖాన్, వల్లపు దాసు అంజయ్య, మాజీ ఉప సర్పంచ్ చిన్న పంగు రాజీవ్ లు పాల్గొన్నారు.

## పర్యావరణం శ్వాసగా ఆయన మార్గం అసాధారణం
### స్పందన సాహిత్య కళావేదిక అధ్యక్షులు కర్ల శ్రీనివాస్

**హుజూర్ నగర్ ,మహా:** పర్యావరణ పరిరక్షణ ప్రాణంగా ప్రకృతిని కాపాడి వృక్షో రక్షతి రక్షితః అనే నినాదంతోపచ్చదనం యొక్క ప్రాముఖ్తను చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి వనజీవి రామయ్య ఆయన సేవలు మానవ మనుగడకు ప్రకృతి పట్టుకొమ్మలని స్పందన సాహిత్య కళావేదిక అధ్యక్షుడు కర్ల శ్రీనివాస్ తెలిపారు. మార్గం ఎంత కఠినమైనదైన వెనకడుగు వేయకుండా ఆత్మవిశ్వాసమే అండగా పర్యావరణం శ్వాసగా జీవితం గడిపిన వనజీవి రామయ్య ఆయన జీవితం అసాధారణమని శ్రీనివాస్ అన్నారు. ఆటంకాలను ఛేదించి మొక్కలు నాటడం ధ్యేయంగా దరిపెల్లి రామయ్య ఇంటి పేరును కాకుండా వనజీవిగా మారి మన జీవిరామయ్యగా పేరు పొందిన పద్మ శ్రీ అవార్డు గ్రహీత రామయ్య మరణం ప్రకృతికి సమాజానికి తీరని లోటని శ్రీనివాస్ తెలిపారు. కోటి మొక్కలు నాటిన ఆయన జీవితం యువతరానికి నవతరానికి ఆదర్శనీయమని అన్నారు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వనజీవి రామయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నేటి యువత ఆయన మార్గంలో ప్రయాణం చేయాలని కోరారు.



# రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

### పంటకాలం పూర్తయ్యే వరకు సాగునీరు అందించాం
### తరుగు, కోతలు లేకుండా ధాన్యం కొనుగోళ్లు
### చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం
### వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**కరీంనగర్, మహా:** రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, యాసంగి పంట కాలానికి పూర్తిస్థాయిలో సాగునీరు అందించామని, తరుగు, కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం అన్నారు.

రామడుగు మండల కేంద్రంలో, గంగాధర మండలం కురిక్యాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పని చేస్తోందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో 72 వేల కోట్ల రూపాయల రైతు రుణమాఫీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలోనే శ్రీపాద సాగర్, ఎస్ ఆర్ ఎస్ పి, కడెం వంటి ప్రాజెక్టులకు రూపకల్పన జరిగిందని అన్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగానే ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు వరద కాలువ, కాకతీయ కాలువల ద్వారా సమృద్ధిగా సాగునీరు వస్తోందని తెలిపారు. చెప్పిన విధంగానే రెండు లక్షల రైతుల రుణమాఫీ, సన్నాలకు 500 రూపాయల బోనస్ ఇచ్చామని అన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైస్ మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి కట్టింగులు లేకుండా కొనుగోలుకు ఆదేశించినట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా నిరంతరం సాగునీరు అందించి ఒక్క గుంట భూమి కూడా ఎండిపోకుండా చూశామని తెలిపారు. చొప్పదండి నియోజకవర్గాన్ని ఇరిగేషన్ హబ్ గా మారుస్తామని, కోనసీమను తలపించే విధంగా చేస్తామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ రైతుల పక్షపాతిగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు నీడ, త్రాగునీరు వంటి సౌకర్యాలను కల్పించాలని, అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా తార్పాలీన్ కవర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొనుగోళ్లలో కట్టింగ్, కోతలు లేకుండా చూడాలని అన్నారు. 48 గంటల్లోగా రైతులకు ధాన్యం సొమ్ము వచ్చేలా వెంట వెంటనే ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బీర్ల వెంకటేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మనపల్లి తిరుమల తిరుపతి, ఎంపీడీవోలు ఎమ్మార్వోలు, సింగిల్ విండో చైర్మన్లు పాల్గొన్నారు.



### వనజీవి రామయ్య మరణం పర్యావరణ పరిరక్షణ ఉద్యమానికి తీరని లోటు: మధుయాష్కీ గౌడ్

50 ఏళ్లకు పైగా పర్యావరణం పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. తన జీవితాంతం మొక్కల పెంపకం ఆవశ్యకతను ఒక ఉద్యమంలా ముందుకు నడిచిన గొప్ప వ్యక్తి పద్మశ్రీ వనజీవి రామయ్య. రామయ్య గారి మరణం పర్యావరణ పరిరక్షణ ఉద్యమానికి తీరని లోటు. తన జీవిత కాలంలో కోటికి పైగా మొక్కలు నాటి, కోట్లాది మందిలో మొక్కల పెంపకంపై అవగాహన పెంచిన మహనీయులు రామయ్య. ఆయన మరణం తీవ్ర బాధను కలిగించింది. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్దామని అందరం ప్రతిజ్ఞ చేద్దాం.

**-మధుయాష్కీ గౌడ్, చైర్మన్, క్యాంపెయిన్ కమిటీ, టీపీసీసీ మాజీ పార్లమెంట్ సభ్యులు**

## రజతోత్సవ సభకు పట్నం అవినాష్ రెడ్డి
# 25 లక్షల విరాళం

**కేటీఆర్ కు చెక్కు అందించిన అవినాష్ రెడ్డి**
**అవినాష్ రెడ్డిని అభినందించిన కేటీఆర్**
**పార్టీ కోసం తాను ఎల్లప్పుడూ ముందుంటా**
**రంగారెడ్డి జిల్లా యువజన అధ్యక్షుడు- అవినాష్**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** భారత రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావ రజతోత్సవం సందర్భంగా 25 లక్షల రూపాయలను అవినాష్ రెడ్డి విరాళంగా అందజేశారు. భారత రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావ దినోత్సవం, సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా ఈనెల 27 న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే రజోత్సవ సంబురం సభకు, బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పట్నం అవినాష్ రెడ్డి తన వంతు సహకారాన్ని అందించారు. శనివారం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, కల్వకుంట్ల తారక రామారావును కలిసి రూ 25 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అవినాష్ రెడ్డిని అభినందించారు. పార్టీ కార్యకర్తగా కెసిఆర్ అడుగుజాడల్లో నడుస్తూ కేటీఆర్, హరీష్ రావు, సబిత ఇంద్రారెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, కార్యకర్తల తదితరులతో కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అవినాష్ రెడ్డి అన్నారు.



# ఇంటర్ విద్యార్థిని బర్త్ డేనే డెత్ డే

### ఆత్మహత్య పాల్పడ్డ యువతి
### షాద్‌నగర్ పట్టణంలో విషాదఛాయలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పుట్టిన రోజే విషాదం నింపిన ఘటన షాద్ నగర్ పట్టణంలో చోటుచేసుకుంది. చేవెళ్ల గురుకుల కాలేజీలో విద్యార్థిని ప్రణీత, ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. శనివారం ఉదయం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని తన ఇంట్లో ఉన్న బాత్రూంలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రణీత మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రణీత ఆత్మహత్యతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు.

## టియుడబ్ల్యుజె జిల్లా
## నూతన కార్యవర్గ సభ్యులకు సత్కారం

### కార్పొరేటర్ గందె కల్పన నవీన్

**వరంగల్, మహా;** సమాజంలోని నిరుపేదల గొంతుక జర్నలిస్టులు అని 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన నవీన్ శనివారం అభిప్రాయపడ్డారు. అవినీతి, పేదరికాన్ని నిర్మూలించడానికి కృషి చేయాలని ఆమె జర్నలిస్టులకు పిలుపునిచ్చారు. శ్రీ బాలానగర్ వెంకటేశ్వర స్వామి ఆలయ సమావేశ మందిరంలో ఐజెయు అనుబంధ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజె) వరంగల్ జిల్లా యూనిట్ నూతనంగా ఎన్నికైన కార్యనిర్వాహక సంస్థ అభినందన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జర్నలిస్టులు పేద ప్రజల సమస్యలను ఎత్తిచూపుతూ, వాటిని జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపె దిశగా జర్నలిస్టులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ రామచందర్, ప్రధాన కార్యదర్శి మట్ట దుర్గ ప్రసాద్, కార్యదర్శి ఎం.డి. ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్స్ జె స్వామి, కె వేంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శులు రాజు, సతీష్‌లను అర్చకులు పరాశరం శ్రీనివాసాచార్యులు, సుదర్శనాచార్యులు ఆశీర్వదించారు. ఫ్రెండ్స్ యూనిట్ ఆర్గనైజర్ గందె నవీన్ శ్రీనివాస పద్మావతి సేవా ట్రస్ట్ అధ్యక్షులు సందీప్, కార్యదర్శి బొద్ల రవీంద్రనాథ్, జి గోవింద రాజులు, ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ సంయుక్తంగా జర్నలిస్ట్ అధ్యక్షుడు రాంచందర్, ఇతర ఎన్నికైన సభ్యులను శాలువాలు పూలమాలలతో సత్కరించారు. అంతకు ముందు టి యు జె అధ్యక్షుడిని ఆర్య వైశ్య మహాసభ కార్యాలయంలోని ఓల్డ్ బీట్ బజార్‌లో సత్కరించారు.

## దళిత బంధు నిధులు విడుదల చేయాలంటూ
# లబ్ధిదారుల రాస్తారోకో

**కాటారం, మహా:** గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాంలో దళిత బంధు పథకంలో మంజూరైన నిధులను వెంటనే విడుదల చేయాలని లబ్ధిదారులు పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. శనివారం కాటారం మండలం గార పెల్లి చౌరస్తాలో భారత రాజ్యాంగ స్థూపం ఆవిష్కరణ అనంతరం కాటారం రెవెన్యూ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన దళిత బంధు లబ్ధిదారులు ఆందోళన నిర్వహించారు. ఫ్రీజింగ్ చేసిన నిధులను వెంటనే విడుదల చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. సుమారు గంటకు పైగా ఎండలో వేడిమిని భరిస్తూ లబ్ధిదారులు రాస్తారోకో నిర్వహించగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా అధికారులు సమస్యను పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని రాస్తారోకో నిర్వహించారు. మహాదేవపూర్, వరంగల్, మంథని మూడు వైపులా రహదారుల లో ఆర్ టీ సి బస్సులు,



లారీలు, ఆటోలు,ద్విచక్ర వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ సమస్య ను పోలీసులు పరిష్కారం కోసం సబ్ కలెక్టర్, తహశీల్దార్ ఉన్నతాధికారులకు తెలిపేందుకు యత్నించగా ఎవరు అందుబాటులో లేరు. పోలీసులు కొంత సేపు వేచి చూసి రాస్తారోకో చేస్తున్న దళిత బంధు లబ్దారులను బలవంతంగా విరమింపజేశారు.

# నిరుపేదలకు అండగా విఆర్ ఫౌండేషన్

## డప్పు వాయిద్యాలు మధురం తీరేవేరు

**కళాకారులకు డబ్బుల పంపిణీ.. ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి**
**రేపు కాగజ్ ఘాట్ లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ**
**హాజరుకానున్న స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నేటి కాలంలో డీజే, లౌడ్ స్పీకర్ ల రూపంలో ఎంత టెక్నాలజీ పెరిగిన, డప్పుకున్న ప్రాధాన్యత తగ్గలేదని విఆర్ వన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ మాదిగ జేపీసీ చైర్మన్ బోసు పల్లి ప్రతాప్ ల సమక్షంలో గ్రామంలో గల డప్పు కళాకారులకు ఉచితంగా విఆర్ వన్ ఫౌండేషన్ ద్వారా డప్పులను పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ మాట్లాడుతూ... అనాదిగా వస్తున్న డప్పు వాయిద్యాలు మధురం తీరేవేరని ఆయన కొనియాడారు. కళాకారులు డబ్బుతో తమ ప్రతిభను కనబరుస్తూ, రకరకాల శబ్దాలను చేస్తూ చూపరులను ఆకర్షిస్తూ ఉంటారు. డప్పు అనేది ఒక జీవనశైలిగా ఉంటుందని, కళాకారులకు ఫౌండేషన్ దాన అందించిన డబ్బులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పేద ప్రజల కోసం తాను ఎప్పుడు అండగా ఉంటానని తెలియజేశారు. అనంతరం బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ... తన సొంత గ్రామంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయుటకు ముందుకు వచ్చిన, విఆర్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదములు తెలిపారు. అదేవిధంగా కులవృత్తుల వారికి నెలకు భృతి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ శాఖ మాదిగ జేపీసీ అధ్యక్షుడు నరాల చంద్ర పాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంబాలపల్లి భాస్కర్, మాజీ సర్పంచులు బోడ కృష్ణ, బండిమీద కృష్ణ గ్రామ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు నరాల రవీందర్, ఎమ్మార్పీఎస్ నాయకులు నరాల మల్లేష్, గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు నర్కుడి మహేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మడుపు వెంకటేష్, బోస్ పల్లి అరుణ్ కుమార్, యువకులు చింతపట్ల యాదగిరి, నరాల రఘు, బోసుపల్లి నర్సింహా, నల్లోల నర్సింహా, నల్లోల వినయ్ కుమార్, బుగ్గ రాములు, సుధాకర్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

**విఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను ప్రారంభించనున్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి...**

ఈనెల 14న సోమవారం జరిగే అంబేద్కర్ జయంతి సందర్భంగా మంచాల మండలం కాగజ్ ఘాట్ గ్రామంలో దేశ రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వీఆర్ఏ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు రెడ్డి రంగారెడ్డి హాజరై, విగ్రహ ఆవిష్కరణ చేయనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి తెలియజేశారు. అనంతరం అస్మత్ పూర్ గ్రామంలో, ఆంబోతు తండాలో వీఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు చైర్మన్ తెలిపారు.



## ఘనంగా పోషణ పక్వాడ
# వారోత్సవాలు

**కాటారం, మహా :** మండలంలోని ధన్వాడ గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడా పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా గర్భిణీలు, బాలింతలకు, చిన్నారులను భరువులు తీసి ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను అవగాహన కల్పించారు.మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల చిన్నారులు, బాలింతలు, గర్భిణీలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.ఆరోగ్యమే మహాభాగ్యమని వివరించారు.ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో అవగాహన కల్పించారు.అలాగే చేతులు శుభ్రం చేసుకోవడంపై అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కారెంగుల శ్రీలత, తిత్తుల రజిత,ఏఎన్ఎం ,ఆశా రజిత, లబ్దిదారులు, బాలింతలు, గర్భిణీలు పాల్గొన్నారు.

# అజాతశత్రువు... అందరివాడు.. శ్రీపాదరావు

## మావోయిస్టుల చేతిలో దారుణ హత్యకు గురైన ప్రజల మనిషి

### నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిన అభివృద్ధి ప్రదాత.. నేడు మాజీ స్పీకర్ శ్రీపాదరావు వర్ధంతి



**కాటారం, మహా :** సరిగ్గా 25 ఏళ్ల క్రితం ఇదే రోజున మహాదేవపూర్ మండలం అన్నారం అడవుల్లో పేలిన మావోయిస్ట్ ల తుపాకీ తూటాలకు మంథని ప్రాంతం ఒక మహానేతను కోల్పోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అజాత శత్రువుగా,వివాదరహితుడిగా ముద్రపడ్డ దివంగత మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు ను అప్పటి పీపుల్స్ వార్ (నేటి మావోయిస్టు) పార్టీ చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు.ఈ హత్య జరిగి నేటికి 25 ఏళ్ళు గడిచినా మంథని నియోజకవర్గ ప్రజలు మరిచిపోలేకుండా ఉన్నారంటే ఆయన వ్యక్తిత్వం, చేసిన సేవలు ఎంతవరకు ప్రజల మనసుల్లో గూడు కట్టుకుపోయాయో అర్థం చేసుకోవచ్చు.రాజ్యాంగ పదవిలో ఉండి చట్టవ్యతిరేకంగా నక్సల్స్ కు సహకరిస్తున్నాడని విమర్శలు ఎదుర్కొన్న శ్రీపాదరావు చివరికి వారి చేతిలోనే ధారుణహత్రకు గురికావడం విమర్శకులకు సైతం అర్థం కానీ విషయంగా మిగిలింది. నేడు ఏప్రిల్ 13 న ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహానేత గురించి... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి కరీంనగర్ జిల్లా ఇప్పటి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామంలో దుద్దిళ్ళ రాధాకిష్టయ్య,కమలాబాయి దంపతులకు 1935 మార్చి 02 న శ్రీపాదరావు జన్మించారు.అమ్మమ్మ వారు నివాసముండే నాగపూర్ లో పుట్టిన అయన ప్రాధమికవిద్య జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామంలో జరిగింది. ఎచ్ఎస్ఎస్సీ మంథనిలో బావ సువర్ణచంటయ్య ఇంట్లో ఉండి పూర్తిచేశాడు.ఇంటర్,బీఎస్సీ హైదరాబాద్ లో చదివిన తరువాత ఆదిలాబాద్ జిల్లాలో పంచాయతి ఇన్స్పెక్టర్ గా ఉద్యోగంలో చేశారు.ఆతరువాత న్యాయ విద్య చదవడం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి దీర్ఘకాలిక సెలవు పెట్టి నాగపూర్ లో ఎల్.ఎల్.బి.పూర్తి చేసి ప్రాక్టీసు పెట్టారు.అదే సమయంలో తండ్రి రాధాకిష్టయ్య మరణించడంతో స్వంత ఊరు ధన్వాడ కు శ్రీపాదరావు తిరిగి వచ్చారు. తండ్రి వదిలివెళ్ళిన వ్యవసాయమే వృత్తిగా చేసుకొని గ్రామంలోనే ఉన్నాడు.కొన్ని రోజుల తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు రాగా ధన్వాడ గ్రామపంచాయతీ సర్పంచ్ గా పోటీ చేయాలని ప్రజలు ఒత్తిడిచేశారు. నాయకత్వ లక్షణాలు పుణికి పుచ్చుకున్న శ్రీపాదరావు రాజకీయాల్లోకి అడుగిడాలని స్నేహితులు,హితులు ప్రోత్సహించారు.ఆతర్వాత జరిగిన ఎన్నికల్లో శ్రీపాద రావు మొదటిసారిగా ఏకగ్రీవంగా సర్పంచ్ పదవికి ఎన్నుకోబడ్డారు.అలాగే వరుసగా మరో మూడు పర్యాయాలు ఆయనే ధన్వాడ గ్రామ ప్రజల మద్దతుతో పోటీలేకుండా సర్పంచ్ గా ఎన్నికయ్యారు.అదే సమయంలో మహాదేవపూర్ సమితి అధ్యక్షునిగా ఎన్నికై ఎల్.ఎం.బి బ్యాంకు ఛైర్మన్గా గెలిచాడు.

ఇక ఆతర్వాత శ్రీపాద రావు వెనుదిరిగి చూడలేదు. రాజకీయ ఎదుగుదలకు ఎల్.ఎం.బి బ్యాంకు ఛైర్మన్ ఎన్నిక సహకరించడంతో పూర్తిగా మంథని నియోజకవర్గానికి ఆయన సుపరిచితమైనాడు.పదవివస్తే ముఖంచాటు చేసుకునే నాయకులకు భిన్నంగా అయన ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్ట, నష్టాలలో పాలు పంచుకొని ప్రజానాయకునిగా ఎదిగాడు. ఆక్రమంలోనే మంథని ఎమ్మెల్యేగా నాలుగు మార్లు గెలిచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంత్రిగా,ముఖ్యమంత్రిగా వ్యవహరించిన పీ.వి.నరసింహ రావుకు అత్యంత సన్నిహితునిగా మారారు.ఆతర్వాత జరిగిన రాజకీయ పరినామాల్లో పీ.వి కేంద్ర రాజకీయాలలోకి వెళ్ళడం మంథని అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ అభర్థి అవసరం ఏర్పడింది..1983లో ఎన్టీఆర్ టీడీపీ పార్టీ పెట్టడం అదే సంవత్సరం ఎన్నికలు జరగడం కాకతాలీయంగా జరిగింది.పీ.వీ మద్దతుతో మంథని నుండి కాంగ్రెస్ పార్టీ అబ్యర్థిగా శ్రీపాదరావుకు పోటి చేసే అవకాశం లభించింది.అప్పుడే పురుడు పోసుకున్న తెలుగు దేశం పార్టీ ప్రభావం,ఎన్టిఆర్ ప్రభంజనం ముందు శ్రీపాదరావు విజయం సాదించగలుగుతాడా అనే అనుమానం స్వపార్టీ,విపక్షాలలో తీవ్రచర్చ జరిగింది.తెలుగుదేశం, సంజయ్ విచార్ మంచ్ మధ్య ఎన్నికల ఒప్పందం కారణంగా మంథని శాసనసభ నియోజకవర్గం నుండి పోటిగా సంజయ్ విచార్ మంచ్ పార్టీ నుండి చంద్రుపట్ల రాజిరెడ్డి పోటీకి దిగారు.వీరిద్దరి మధ్య గట్టి పోటి నెలకొనగా చివరకు శ్రీపాదరావు విజయం సాధించారు.ఆతరువాత జరిగిన ఎన్నికల్లో మూడుసార్లు శాసన సభ్యులుగా ఎన్నికై శాసనసభ స్పీకర్ గా పదవి చేపట్టారు.ఆ సమయంలో ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా ఉన్న ఎన్టీఆర్ శ్రీపాద రావు మంచితనానికి,వ్యక్తిత్వానికి మద్దతు పలికి ఏకగ్రీవంగా శాసనసభ స్పీకర్ పదవిని అదిష్టించారు.స్పీకర్ పదవికి శ్రీపాద రావు వన్నెతెచ్చారని ఎంతోమంది ప్రముఖులు ,రాజకీయ విశ్లేసకుల ప్రశంశలు పొందారు.ఒకవైపు స్పీకర్ పదవి బాధ్యతతో నిర్వహిస్తునే మరోవైపు తన మంథని నియోజకవర్గ ప్రజలను మాత్రం మరిచిపోకుండా మరింత దగ్గరయ్యారు.విమర్శలకు వెరవకుండా,పొగడ్తలను లెక్క చేయకుండా అభివృద్ధిపై దృష్టిసారిస్తూ ముందుకు కదిలారు.అదే సమయంలో రాష్ట్రంలో అప్పటి పీపుల్స్ వార్ నక్సల్స్ ప్రభావం తీవ్రంగా ఉంది. పీపుల్స్ వార్ దళాలకు పెట్టని కోటలా మంథని తూర్పు అడవులు ఉండేవి.ప్రభుత్వానికి సమాంతరంగా పీపుల్స్ వార్ నక్సల్స్ ప్రభావం, చర్యలు ఈప్రాంతంలో ఉండేవి.ఆక్రమంలో స్పీకర్ గా వ్యవహరించిన శ్రీపాద రావుకు పీపుల్స్ వార్ నక్సల్స్ కు సంబంధాలు ఉన్నాయని పోలీసు ఉన్నతాధికారులు, రాష్ట్ర ఇంటెలిజెన్స్ అధికారులు విచారణ మొదలుపెట్టడం మీడియా ఫోకస్ పెరగడందే.ప్రభుత్వంలో రాజ్యంగ పదవిలో ఉన్న శ్రీపాదరావు నక్సల్స్ కు సహకరిస్తున్నారని విమర్శలు ఎదుర్కొన్నారు.అదే దశలో 1994 ఎన్నికల ముందు నక్సల్స్, పోలీసుల మధ్య జరిగిన ప్రత్యేక్ష పోరు తీవ్రంగా ప్రభావం చూపింది. తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల్లో ఎన్నికలు ముగిశాయి.ఈ ఎన్నికల్లో అనుకోని పరిస్థితుల్లో శ్రీపాదరావు పరాజయం పాలయ్యాడు.ఓటమిపాలయినా ప్రజలకు మాత్రం శ్రీపాద రావు దూరం కాలేదు.నిత్యం ప్రజల మధ్యలోనే ఉండేవారు. పాలకపక్షంపై పల్లెత్తు మాట, విమర్శకూడా చేయకుండా హుందాగా వ్యవహరించి ప్రజాభిమాన్ని మరింత చూరగొన్నారు.ప్రజల మధ్య ఉంటూ వారి బాగోగులను పట్టించుకునే పరిస్థితుల్లోనే ఆయనను మృత్యువు నక్సల్స్ రూపంలో కబళించింది.1999 ఏప్రిల్ 13 న మహాదేవపూర్ మండలం అన్నారం గ్రామానికి తన అనుచరులతో వెళ్లవస్తున్న క్రమంలో మార్గ మధ్యంలోని అడవుల్లో ఆయన వాహనాన్ని నక్సల్స్ ఆపివేసి మాట్లాడాలని చెప్పి శ్రీపాద రావును అడవి లోపలికి తీసుకెళ్ళి కరుకు తుపాకి తూటాలతో విగత జీవున్ని చేశారు.ఈసంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కుదిపివేసింది.ఏ వ్యక్తికి ఎన్నడు అపకారాన్ని తలపెట్టని నాయకుణ్ణి నిష్కారణంగా హతమార్చిన నక్సల్స్ పై విమర్శలు గుప్పుమన్నాయి.రాజకీయంగా అనిశ్చిత పరిస్థితి నెలకొంది.ప్రజల కోసం తుపాకులు పట్టినట్లు చెప్పుకొనే నక్సల్స్ ఇలాంటి దుశ్చర్యకు పాల్పడడం పై ప్రతి ఒక్కరు ప్రత్యక్షంగా విమర్శించారు. అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం హుటాహుటిన మర్చురీలో ఉన్న శ్రీపాద రావు మృత దేహాన్ని చూసేందుకు హుటాహుటిన తరలివచ్చారు. మంథనిలో నక్సల్స్ కు వ్యతిరేఖంగా నినాదాలు చేస్తూ, కన్నీటి పర్యంతమై అయన అంత్యక్రియల్లో లక్షలాది మంది ప్రజలు పాల్గొన్నారు.అయన మరణించినా... ఇప్పటికి ప్రజల హృదయాల్లో అజాతశత్రువుగా,మహానేతగా చిరస్థాయిగా నిలిచిపోయాడు.

## వార్మ్ అప్ అండ్ లాంగ్ జంప్ ట్రాక్

# నిర్మాణానికి శంకుస్థాపన



**హన్మకొండ, మహా;** బల్దియా పరిధి ఏడవ డివిజన్ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం (జె ఎన్ ఎస్)లో జీ డబ్ల్యూ ఏం సి సాధారణ నిధులు రూ.90 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న వార్మ్ అప్ అండ్ లాంగ్ జంప్ ట్రాక్ నిర్మాణానికి శనివారం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా కడియం కావ్య, జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేనాయినిరాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, స్థానిక డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, హన్మకొండ జిల్లా ఒలంపిక్స్ అధ్యక్షులు వరద రాజేశ్వర్ రావు, జిల్లా బాడ్మింటన్ సెక్రటరీ రమేష్ రెడ్డి, తదితరులు, పాల్గొన్నారు.



## శోభాయమానంగా వీరహనుమాన్

# శోభ యాత్ర బైక్ ర్యాలీ

**వరంగల్, మహా;** విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వరంగల్ మహానగర్ వీర హనుమాన్ విజయాత్ర బైక్ ర్యాలీలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పాల్గొన్నారు. ఈ విజయయాత్ర మహా బైక్ ర్యాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చాముండేశ్వరి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ కృష్ణా చాముండేశ్వరి మహర్షి పాల్గొని ప్రారంభించారు. హిందువులందరూ సంఘటితమై అఖండ భారతవని భూమి కోసం, సనాతన ధర్మం కోసం, హిందూ ధర్మం కోసం, దేశ ధర్మం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ శ్రేణులతో పాటు బిజెపి నాయకులు అలాగే పెద్ద ఎత్తున బిజెపి శ్రేణులు పాల్గొన్నారు.

## ఉచిత సన్న బియ్యం పథకం ద్వారా

# పేదవారి ఇంట్లో సంతోషం

### లబ్ధిదారులు ఇంట్లో భోజనం చేసిన మంత్రి, కలెక్టర్, కమిషనర్

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి



**వరంగల్, మహా;** వరంగల్ నగరం బల్దియా పరిధిలోని 12 డివిజన్ దేశాయిపేట లో శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం లబ్ధిదారుడు పూర్ణచందర్ ఇంట్లో భోజన కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొని సహా పంక్తి భోజనం చేశారు. అనంతరం..... 19, 24 డివిజన్ లలో సి సి రోడ్ లు, డ్రైన్ లకు శంకుస్థాపనలు వరంగల్ (తూర్పు) నియోజక వర్గ బల్దియా పరిధి 19వ డివిజన్ భగత్ సింగ్ నగర్ లో బల్దియా ఆధ్వర్యంలో రూ.33 లక్షల స్పెషల్ డెవలప్మెంట్ నిధులతో చేపట్టనున్న సి సి రోడ్డు, పైపులైన్, డ్రైన్ నిర్మాణంతో పాటు 24 వ డివిజన్ లోని షేర్ పుర పాఠక్ మేహాల్లా లో రూ.20 లక్షల స్పెషల్ డెవలప్మెంట్ నిధులతో చేపట్టనున్న సి సి రోడ్డు, డ్రైన్స్ నిర్మాణానికి శనివారం రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ మంత్రి వర్యులు కొండా సురేఖ శంకుస్థాపన లు చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డా.సత్య శారద, బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే లతో పాటు కార్పొరేటర్లు ఓని స్వర్ణలత భాస్కర్, రమా తేజస్వి శిరీష్, కావటి కవిత, చింతాకుల అనిల్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మీసాల ప్రకాష్, స్థానిక నాయకులు మబ్బు ప్రవీణ్ పాల్గొన్నారు.

## గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో

# గావ్ చలో కార్యక్రమం

### ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి

**పరకాల, మహా;** బిజెపి ఆధ్వర్యంలో గావ్ చలో అనే కార్యక్రమంలో భాగంగా పరకాల పట్టణంలో బిజెపి పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, పరకాల కాంటెస్టెంట్ ఎమ్మెల్యే డాక్టర్ కాళి ప్రసాద్ రావు, డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం దేశంలోని అతి పెద్ద పార్టీగా ఏర్పడిందని బిజెపి సంస్థాపన దినోత్సవంలో భాగంగా గావ్ చలో అనే కార్యక్రమంతో పాటు ప్రజలకు అందిస్తున్న కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బిజెపి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళారు వెళ్లేందుకు పార్టీ ఆదేశించిందని ఇందులో భాగంగానే గ్రామాలు, పట్టణంలో కుల సంఘ నాయకుల దగ్గరికి వెళ్లి కలవడం వారి సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 13వ తారీకు నుండి 26 వరకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అదేవిధంగా నరేంద్ర మోడీ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే తెలంగాణలో కాంగ్రెస్ అబద్ధాలతో అధికారంలోకి వచ్చి దిక్కుతోచని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వ భూములను అమ్ముకుంటుందని ఎద్దేవా చేశారు.

## జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదం

# గొప్ప నినాదం

### రాజ్యాంగ పరిరక్షణ కోసం మనందరం కలిసి పోరాడాలి

### స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి




**జనగామ, మహా;** బాపును గౌరవించుకోవాలి, అంబేద్కర్ ను గౌరవించుకోవాలి, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికే జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం చేపట్టడం జరిగిందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ హాల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ లకావత్ ధన్వంతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ..**

జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 14వ తేదీ ఉదయం 9గంటలకు నియోజకవర్గలోని అన్ని గ్రామాల విధులలో జాతీయ జెండా, మహాత్మా గాంధీ చిత్ర పటం, అంబేద్కర్ చిత్ర పటంతో కాంగ్రెస్ పార్టీ జెండాలు పట్టుకొని పాదయాత్ర చేయాలని సూచించారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో అంబేద్కర్, బాపు చిత్ర పటాలకు నివాళులు అర్పించాలని తెలిపారు. అనంతరం గ్రామాల నుండి మండల కేంద్రాలకు చేరుకొని సుమారు 1000 మందితో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి సంబందించిన జెండాలు, కరపత్రాలు, బాపు, అంబేద్కర్ చిత్ర పటాలు ఇతర సామాగ్రిలను ఆదివారం మధ్యాహ్నం గ్రామాలకు చేరుకోవాలని ఈ బాధ్యత మండల పార్టీ అధ్యక్షులదేనని స్పష్టం చేశారు. జై బాపు జై భీమ్ జై సంవిధాన్ నినాదం గొప్ప నినాదామని అన్నారు. దేశానికి అహింసా మార్గంలో స్వాతంత్రం తీసుకువచ్చిన బాపు ను మర్చిపోతున్నారని, దేశంలో ప్రస్తుతం గాడ్సేల పాలన సాగుతోందని ఇది దేశానికి చాలా ప్రమాదామని తెలిపారు. బాపు గురించి, ఆయన ఔన్నత్యం గురించి భావితరాలకు తెలపాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. అలాగే దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన వ్యక్తి మన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ను అన్ని దేశాలు ప్రపంచ మేధావిగా అభివర్ణింస్తుంటే బీజేపీ నేతలు దాన్ని అంగీకరించడం లేదని ఆరోపించారు. ఎందుకంటే వాళ్లకు కులం అడ్డువస్తుందని అందుకే వాళ్ళు జిర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా అందించిన హక్కులు, రిజర్వేషన్లు కల్పించకపోతే దేశం ఏనాడో చీలిపోయేదని తెలిపారు. రాజ్యాంగం పైన దాడి జరుగుతోందని, రాజ్యాంగంలో మార్పులు చేయాలని, రాజ్యాంగాన్ని మొత్తమే మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇది చాలా ప్రమాదమని రాజ్యాంగాన్ని మనం కాపాడుకుంటే రాజ్యాంగం మనల్ని కాపాడుతుందని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం మనందరం కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రతీ ఒక కాంగ్రెస్ కార్యకర్త సమన్వయంతో కలసి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ స్థాయి పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో పేదవాడి కడుపు నింపడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు





**వరంగల్, మహా;** వర్ధన్నపేట మండల పరిధి లోని దమ్మన్నపేట గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ముగించుకొని గ్రామంలోని సన్న బియ్యం లబ్ధిదారులైన మెరుగు రాధిక రమేష్ ల ఆహ్వానం మేరకు వారి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన సన్నబియ్యంతో వండిన భోజనాన్ని కుటుంబ సభ్యులు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, స్థానిక నాయకులతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు, జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సన్నబియంతో మంచి భోజనం పెట్టిన ఆడబిడ్డ మెరుగు రాధిక రమేష్ లకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, వరంగల్, హనుమకొండ జిల్లాల కిసాన్ సెల్ అధ్యక్షులు బొంపల్లి దేవేందర్రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పత్రి భాను ప్రసాద్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏపి కుమార్, జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు, పాల్గొన్నారు..

## బ్యాంక్ లో దొంగతనానికి యత్నించిన ముఠా అరెస్ట్




**ఆదిలాబాద్ మహా :** గత డిసెంబర్ 12న ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో దొంగతనానికి యత్నించిన ముఠాలోని ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహా జన్ తెలిపారు.శనివారం స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ప్రజల మధ్యలో ఉంటూ ఎన్నో నేరాలకు పాల్పడుతూ బ్యాంకుకు కన్నం వేసే ప్రయత్నంలో అక్కడి మోషన్ డిటెక్షన్ అలారాం మోగడంతో పారిపోయిన ముఠాలోని మొత్తం 9 మందిలో ముగ్గురు దొంగలను సీసీఎస్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నట్టు వివరించారు. కచ్ కంటి గ్రామ శివారులో పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించగా విచారణ లో నేరం అంగీకరించినట్టు తెలిపారు. వారి వద్ద నుండి బ్యాంకు దొంగతనానికి ఉపయోగించిన గ్యాస్ సిలిండర్, గ్యాస్ కట్టర్, గడ్డపార స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. నిందితులందరిపై వివిధ జిల్లాల్లో పలు దొంగతనాల కింద కేసులు నమోదై ఉన్నట్టు తెలియజేశారు. మరో ముగ్గురు ఏ1చౌహాన్ రవితో పాటు ఏ2 సన్నీ ఏ4 గోవిందుడు ఇప్పటికే వివిధ కేసుల్లో ప్రస్తుతం జైల్లో ఉన్నారన్నారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని, మిగిలిన వారిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనంతరం దొంగతనం చేసిన పద్ధతిని వివరిస్తూ ..నిందితులందరూ దొంగతనానికి ఒక 10 రోజుల ముందు హైవే పై గల ఒక ధాబా లో రామాయి తెలంగాణ గ్రామీణ బ్యాంకు లో దొంగతనానికి ప్లాన్ రచించినట్టు తెలిపారు. ఈ దొంగతనానికి చౌహాన్ రవి కీలకంగా వ్యవహరించినట్టు తెలిపారు. వీరు డిసెంబర్ 12న రామాయి కి బైకులపై చేరుకొని అర్ధరాత్రి వరకు వేచి ఉండి గోడకు కన్నం వేసారు.

# ఇచ్చిన ప్రతీ హామీని దశల వారిగా అమలు చేస్తున్నాం

## రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి సీతక్క

### ములుగు మండలంలో రూ.33 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



**ములుగు, మహా :** ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీమేరకు ములుగు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను విడతల వారీగా అమలు చేస్తున్నామని, రాష్ట్రంలోని పేదప్రజల అభిప్రాయం మేరకే ప్రజా ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశ పెడుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం ములుగు, గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లో మంత్రి సీతక్క పర్యటించారు. మొదట ములుగు మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ లతో కలిసి రూ.33కోట్లతో జంగాలపల్లి గ్రామం నుండి జగ్గన్న గూడెం గ్రామం వరకు చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు, బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా లోతట్టు ఏజెన్సీ గ్రామాల ప్రజలు రోడ్డు సౌకర్యం కల్పించాలని పాలకులకు మొరపెట్టుకున్నప్పటికీ గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, గ్రామాలలో రోడ్డు పనులే కాకుండా జంగాలపల్లి గ్రామం నుండి జగ్గనగూడెం గ్రామం వరకు చేపట్టిన ప్రధాన రోడ్డు పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. జగ్గన్నగూడెం గ్రామం వద్ద గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో లోవల్ బ్రిడ్జి నిర్మించిందని, అయినప్పటికీ ఏజెన్సీ గ్రామాల ప్రజల ఇబ్బందులను గుర్తించి రూ.5కోట్లతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఏజెన్సీ గ్రామాలలోని ప్రజలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వారంలోగా చేపట్టడం జరుగుతుందని, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వెనుకబడిన ప్రజల కలలు నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకు పోతున్నానని, రానున్న రోజులలో ములుగు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. పోషణ పక్షం కార్యక్రమంలో గర్భిణీలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎమ్మార్వో విజయ భాస్కర్, పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, సంబంధిత శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**పంట నష్టపరిహారం చెల్లిస్తాం.. : మంత్రి సీతక్క**

వడగళ్లతో అకాల వర్షం కారణంగా పలు రకాల పంటలను కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వర్షాల కారణంగా ఇండ్లు కూలిపోయిన నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క )అన్నారు. శనివారం గోవిందరావుపేట మండలం దుంపెల్లిగూడెం గ్రామంలో కలెక్టర్ దివాకర టీఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ లతో రైతులు, వర్ష బాధిత కుటుంబాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల పలు మండలాల్లో అకాల వర్షం కారణంగా నోటి కాడికి వచ్చిన పంట దెబ్బ తినడం బాధాకరమని, ఇదే సందర్భంలో పలు రకాల ఇండ్లు కూలిపోవడం జరిగిందని అన్నారు. వర్షం అనంతరం జిల్లా యంత్రాంగం నష్టపోయిన పంట వివరాలు, కూలిపోయిన ఇండ్ల వివరాల సేకరణలో నిమగ్నమైందని, పూర్తి వివరాల సేకరణ అనంతరం నష్టపరిహారం అందించడం జరుగుతుందన్నారు. రైతులకు, బాధిత కుటుంబాలకు భరోసా ఇవ్వడానికే ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రభుత్వ నుండి పూర్తిస్థాయిలో పరిహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటానని సీతక్క హామీ ఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబాలకు తక్షణసాయంగా వంట సామాగ్రి తో పాటు రూ.2500 నగదు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, మండల అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**పేదలతో కలిసి సన్నబియ్యంతో భోజనం చేసిన మంత్రి..**

తిండిలో తేడా వద్దనే సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, ప్రతి ఒక్కరు సన్న బియ్యం తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. తాడ్వాయి మండలం మండలతోగు గొత్తికోయ గూడెంలో కలెక్టర్ దివాకర్ టిఎస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవి చందర్, అదనపు కలెక్టర్ సంపత్ రావు లతో కలిసి స్థానిక పాఠశాలలో పిల్లలు, ప్రజలతో కలిసి సన్న బియ్యంతో వండిన ఆహారాన్ని భుజించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేదలందరికీ సన్నం బియ్యం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. రానున్న రోజులలో రేషన్ కార్డు లేని నిరుపేదలందరికీ నూతన రేషన్ కార్డులను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున 2.57లక్షల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఆదివాసి గుడాలలో ఏజెన్సీ గ్రామాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ అర్హులైన వారందరికీ అందే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

# ఫ్లిప్‌కార్ట్‌కు గట్టిదెబ్బ

## రూ.కోటికి పైగా జరిమానా..



ప్రముఖ ఈ కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌కు ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్డీఏఐ) నుంచి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆన్‌లైన్ బీమా పంపిణీకి సంబంధించిన ఈకామర్స్ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఫ్లిప్‌కార్ట్ ఇంటర్నెట్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎఫ్ఐపీఎల్)కు ఐఆర్డీఏఐ రూ.1.06 కోట్ల జరిమానా విధించింది.

**ఫ్లిప్‌కార్ట్ పాల్పడిన ఉల్లంఘనలు ఇవే..**

ఫ్లిప్‌కార్ట్ పలు ఉల్లంఘనలకు పాల్పడినట్లు తేలింది. పాలసీ కొనుగోలుదారులను నేరుగా బీమా కంపెనీకి కాకుండా బీమా మధ్యవర్తికి మళ్లించడం ద్వారా ఐఆర్డీఏఐ మార్గదర్శకాలను ఉల్లంఘించింది. గడువు ముగిసిన రిజిస్ట్రేషన్ ఉన్నప్పటికీ బీమా పాలసీలను విక్రయించడం వల్ల అదనపు జరిమానాలు చెల్లించాల్సి వస్తుంది. తగినంత నైపుణ్యం లేకపోవడం అంటే కేవలం ఒకేఒక శిక్షణ పొందిన బీమా నిపుణుడితో 70,000 కంటే ఎక్కువ బీమా పాలసీలను విక్రయించింది. ఇది వినియోగదారుల భద్రత గురించి ఆందోళనలను లేవనెత్తింది.

**పాలసీదారులపై ప్రభావం**

రెగ్యులేటరీ చర్య పాలసీ చెల్లుబాటు, క్లెయిమ్ సెటిల్మెంట్లు, కస్టమర్ మద్దతుపై ఆందోళనలను లేవనెత్తుతుంది. తప్పుడు అమ్మకం ప్రమాదాల కారణంగా కొనుగోలుదారులు పాలసీ నిబంధనలను అర్థం చేసుకోవడంలో అడ్డంకులను ఎదుర్కొంటారు. అయితే రిజిస్ట్రేషన్ గడువు ముగిసిన తర్వాత జారీ చేసిన పాలసీలు చట్టపరమైన అనిశ్చితులను ఎదుర్కోవచ్చు. అదనంగా, శిక్షణ పొందిన సిబ్బంది పరిమిత లభ్యత పాలసీదారు సహాయం, వివాద పరిష్కారాన్ని ప్రభావితం చేస్తుంది.

**కఠినంగా బీమా అమ్మకాలు**

జరిమానాను అంగీకరించిన ఫ్లిప్‌కార్ట్, పరిశ్రమ నిబంధనలకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటిస్తూ ఐఆర్డీఏఐ ఉత్తర్వులను పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. ఈ చర్య ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా బీమా అమ్మకాలను కఠినంగా అమలు చేయడానికి సంకేతం. పాలసీ కొనుగోలుదారులు ఆన్‌లైన్లో బీమా కొనుగోలు చేయడానికి ముందు రిజిస్ట్రేషన్ వివరాలను ధృవీకరించడం, పాలసీ నిబంధనలను జాగ్రత్తగా చదవడం, సర్టిఫైడ్ ప్రొఫెషనల్స్ నుండి మార్గదర్శకత్వం పొందడం మంచిది.

# ఇలాంటి ఇళ్లకే డిమాండ్..

కరోనా, లాక్‌డౌన్ కారణంగా ఇంటికే పరిమితం కావడం అనివార్యమైంది. కరోనా కంటే ముందుతో పోలిస్తే ఇంట్లో గడిపే సమయం పెరిగింది. దీంతో ఇంటి కొనుగోలు ఎంపికలో రాజీపడటం లేదు. రిస్క్ తీసుకునైనా సరే సొంతింటిని కొనుగోలు చేయాలని.. చిన్న సైజు ఇంటి నుంచి విస్తీర్ణమైన గృహానికి వెళ్లాలని.. ఐసోలేషన్ కోసం ప్రత్యేక గది లేదా కుటుంబ సభ్యులతో గడిపేందుకు హాలిడే హోమ్ ఉండాలని భావించే వాళ్ల సంఖ్య పెరిగింది. దీంతో రాబోయే రోజుల్లో గృహ విభాగానికి డిమాండ్ ఏర్పడటం ఖాయమని జేఎల్ఎల్-రూఫ్ అండ్ ఫ్లోర్ సంయుక్తంగా నిర్వహించిన సర్వే వెల్లడించింది. హైదరాబాద్‌తో సహా ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, చెన్నై, పుణే నగరాలలో 2,500 మంది గృహ కొనుగోలుదారులతో సర్వే నిర్వహించింది. పలు కీలకాంశాలివే.. వర్క్ ఫ్రం హోమ్, ఆన్‌లైన్ క్లాస్‌ల నేపథ్యంలో ఫ్లోర్ ప్లాన్స్‌లలో మార్పులు చేయాలని కొనుగోలుదారులు కోరుతున్నారు. బాల్కనీ స్థలంలో అదనంగా ఒక గదిని, ఐసోలేషన్ గదిని ఏర్పాటు చేయాలని



సూచిస్తున్నారు. ఆ తరహా ప్రాజెక్టలలో కొనుగోళ్లకే కస్టమర్లు మక్కువ చూపిస్తున్నారు. గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న అపార్ట్‌మెంట్లు లేదా పేరు మోసిన డెవలపర్లకు చెందిన నిర్మాణంలోని ప్రాజెక్టలలో మాత్రమే కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు. వచ్చే మూడు నెలల కాలంలో 80 శాతం కంటే ఎక్కువ కొనుగోలుదారులు గృహాలను కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. రూ.75 లక్షల కేటగిరీలోని ప్రాపర్టీలను కొనేందుకు సుముఖంగా ఉన్నారు. హైదరాబాద్‌తో సహా బెంగళూరు, చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్ నగరాలలో 3 బీహెచ్‌కే ఫ్లాట్లకు డిమాండ్ పెరిగింది. ఆయా మార్కెట్లలో పెట్టుబడిదారులు తాము ఉండేందుకు గృహాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో విల్లాలు, అభివృద్ధి చేసిన ప్లాట్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ధరలు అందుబాటులో ఉండటం, మార్కెట్‌లో సానుకూల వాతావరణం నెలకొనడం, ప్రోత్సాహకర ప్రభుత్వ విధానాలతో రాబోయే రోజుల్లో హైదరాబాద్ రియల్టీ మార్కెట్‌లో ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని ఓ సంస్థ ఎండీ తెలిపారు. కరోనా ప్రారంభం నుంచి ల్యాండ్ బ్యాంక్‌ను సమీకరించిన డెవలపర్లు.. ఇప్పుడు కొత్త ప్రాజెక్టలను చేపట్టేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. దీంతో రెండో అర్ధ భాగం నుంచి గృహ లాంచింగ్స్‌లో వృద్ధి నమోదవుతుందని అంచనా వేస్తున్నారు.

# ప్రత్యేక బ్యాంక్ స్కీమ్ నిలిపివేత

బ్యాంక్ ఆఫ్ ఇండియా తన ప్రత్యేక 400 రోజుల ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. ఇందులో 7.30% వరకు వడ్డీ రేటు లభిస్తుంది. ఏప్రిల్ 15 నుంచి అమల్లోకి వచ్చే వివిధ ఫిక్స్‌డ్ డిపాజిట్ కాలపరిమితులపై బ్యాంక్ వడ్డీ రేట్లను విస్తృతంగా సర్దుబాటు చేయడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. సవరించిన రేట్ల ప్రకారం 91 నుండి 179 రోజుల మధ్య మెచ్యూరిటీ డిపాజిట్లకు 4.25 శాతం, 180 రోజుల నుండి ఒక సంవత్సరం కంటే తక్కువ మెచ్యూరిటీ ఉన్న డిపాజిట్లకు 5.75 శాతం వడ్డీ లభిస్తుంది. ఇక ఏడాది మెచ్యూరిటీ ఉన్న డిపాజిట్లపై 7.05 శాతం, ఏడాది నుంచి రెండేళ్ల కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై 6.75 శాతం వడ్డీ అందిస్తుంది. రూ .3 కోట్ల నుండి రూ .10 కోట్ల లోపు డిపాజిట్లకు సవరించిన వడ్డీ రేట్లు ఇలా ఉన్నాయి.. 91 నుండి 179 రోజుల మధ్య మెచ్యూర్ అయ్యే డిపాజిట్‌లకు 5.75%, 180 నుండి 210 రోజులకు 6.25%, 211 రోజుల నుండి ఒక సంవత్సరం కంటే తక్కువ కాలపరిమితికి 6.50%. ఏడాది కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై వడ్డీ రేటు 7.05 శాతంగా, ఏడాది కంటే ఎక్కువ కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై 6.70 శాతంగా ఉంది. ఆరు నెలలు లేదా



అంతకంటే ఎక్కువ మెచ్యూరిటీ వ్యవధితో రూ .3 కోట్ల లోపు డిపాజిట్లపై సూపర్ సీనియర్ సిటిజన్లకు 0.65 శాతం, సీనియర్ సిటిజన్లకు 0.50 శాతం అదనపు వడ్డీ రేటును బ్యాంక్ అందిస్తుంది. మరోవైపు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) కూడా అమృత్ కలష్ ఫిక్స్‌డ్ డిపాజిట్ స్కీమ్‌ను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పథకం కింద అందించే వడ్డీ రేటుకు సంబంధించిన వివరాలను ప్రకటనలో వెల్లడించలేదు. అయితే ఫిక్స్‌డ్ టర్మ్ ఇన్వెస్ట్ మెంట్స్ కోరుకునే కస్టమర్లకు బ్యాంక్ ప్రత్యామ్నాయ మార్గాలను అందిస్తూనే ఉంది. దేశంలోని రెండు ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకులు ఈ అధిక వడ్డీ పథకాలను ఉపసంహరించుకోవడం మారుతున్న మార్కెట్ పరిస్థితులు, నియంత్రణ మార్గదర్శకాలకు ప్రతిస్పందనగా వ్యూహాత్మక మార్పును సూచిస్తుంది.



# తెలంగాణ మార్కెట్లోకి కొత్త ఎలక్ట్రిక్ బైక్స్

**హైదరాబాద్:** ఎలక్ట్రిక్ మోటర్‌సైకిల్స్ తయారీ సంస్థ ఒబెన్ ఎలక్ట్రిక్ తెలంగాణ మార్కెట్లోకి ప్రవేశించింది. హైదరాబాద్‌లో రెండు, వరంగల్‌లో ఒకటి చొప్పున మొత్తం 3 షోరూమ్‌లను ప్రారంభించింది. వీటిలో సర్వీస్ సెంటర్లు కూడా ఉంటాయి. ఒక్కో కొత్త షోరూమ్‌లో రోర్ ఈజెడ్ వాహనాన్ని కొనుగోలు చేసిన తొలి 30 కస్టమర్లకు కాంప్లిమెంటరీగా బంగారు నాణెం అందిస్తున్నట్లు సీఈవో మధుమిత అగ్రవాల్ తెలిపారు. రోర్ ఈజెడ్ వాహనం ధర రూ. 89,999గా ఉంటుంది. ఒకసారి చార్జ్ చేస్తే 175 కి.మీ. రేంజి ఇస్తుంది. 2026 ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి 50 నగరాల్లో 100 పైచిలుకు షోరూమ్‌లు, సర్వీస్ సెంటర్లను ప్రారంభించనున్నట్లు వివరించారు. ప్రస్తుతం 35 షోరూమ్‌లు ఉన్నాయి. ఒబెన్ ఎలక్ట్రిక్ దేశవ్యాప్తంగా 15 కొత్త షోరూమ్‌లను ప్రారంభించగా పంజాబ్, గుజరాత్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కొత్తగా అడుగు పెట్టింది. దీనితో పాటు ఇప్పటికే ఉన్న మార్కెట్లలో తన పరిధిని బలోపేతం చేసుకుంది. ఢిల్లీ ఎన్‌సీఆర్, మహారాష్ట్ర, కేరళ, ఉత్తర ప్రదేశ్‌లలో కొత్త అవుట్‌లెట్‌లను ప్రారంభించింది.




# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# విదేశాల్లో ఉద్యోగాలని.. సైబర్ బానిసలుగా మార్చారు

విదేశాల్లో ఉద్యోగాలంటూ సోషల్ మీడియాలో నకిలీ జాబ్ ఏజెన్సీ ప్రకటన నమ్మి వచ్చిన అమాయకులను టూరిస్ట్ వీసాపై థాయ్‌లాండ్, మయన్మార్‌కు వారితో బలవంతంగా డిజిటల్ స్కామ్‌లు, సైబర్ నేరాలు చేయించిన వైనం 60 మందిని కాపాడిన రాష్ట్ర సైబర్ పోలీసు విభాగం.. ఐదుగురి అరెస్టు



**ముంబై:** మయన్మార్‌లో సైబర్ బానిసలుగా బతుకీడుస్తున్న 60 మందికి పైగా భారతీయులను మహారాష్ట్ర పోలీసుల సైబర్ విభాగం రక్షించింది. ఒక విదేశీ పౌరుడు సహా ఐదుగురు ఏజెంట్లను అరెస్టు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాల మేరకు... థాయ్‌లాండ్‌లో మంచి ఉద్యోగావకాశాలున్నాయంటూ మొదట సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల ద్వారా ఓ ముఠా ప్రకటనలిచ్చింది. ఈ ప్రకటనలకు ఆకర్షితులైన కొందరు అమాయకులను సదరు ముఠా ఏజెంట్లు పాస్‌పోర్టులు, విమాన టికెట్లు ఏర్పాటుచేసి పర్యాటక వీసాలపై థాయ్‌లాండ్‌కు, అక్కడినుంచి మయన్మార్ సరిహద్దుకు పంపారు. ఆ తరువాత చిన్న పడవల్లో వారిని నది దాటించి సాయుధ తిరుగుబాటు గ్రూపుల నియంత్రణలో ఉన్న ప్రదేశాల్లో దింపారు. అక్కడ వారితో బలవంతంగా 'డిజిటల్ అరెస్ట్' స్కామ్‌ల నుంచి నకిలీ పెట్టుబడి పథకాల దాకా అనేక సైబర్ మోసాలు చేయించారు. దీనిపై సమాచారమందుకున్న మహారాష్ట్ర సైబర్ పోలీసు విభాగం , ఇతర ఏజెన్సీలతో కలిసి బాధితులను రక్షించింది. త్వరలోనే వీరిని స్వదేశానికి తీసుకురానున్నారు.

**మనీష్ గ్రే సహా నలుగురి అరెస్టు**

రిక్రూట్‌మెంట్ ఏజెంట్లుగా వ్యవహరించారనే ఆరోపణలతో మనీష్ గ్రే అలియాస్ మాడీ, తైసన్ అలియాస్ ఆదిత్య రవి చంద్రన్, రూపనారాయణ్ రాంధర్ గుప్తా, జెన్సీ రాణి డి మరియు చైనీస్-కజకిస్తానీ జాతీయుడు తలానిటి నులాక్సీలను అరెస్టు చేసింది. వీరిలో మనీష్ గ్రే పలు వెబ్ సిరీస్‌లు టెలివిజన్ షోలలో నటించిన ప్రొఫెషనల్ నటుడు అని కొంతమంది వ్యక్తులను నియమించుకుని మయన్మార్‌కు మనుషులను అక్రమ రవాణా చేశాడని పోలీసులు తెలిపారు. తలానిటి నులాక్సీ భారతదేశంలో సైబర్ నేరాలకు పాల్పడేలా ఒక యూనిట్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని, తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

# హింసాత్మకంగా వక్ఫ్ నిరసనలు

## కేంద్ర బలగాలకు హైకోర్టు ఆదేశం

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. గత రెండు రోజులుగా పెద్ద ఎత్తున చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో ఇప్పటివరకూ ముగ్గురు అసువులు బాసారు. నిన్న(శుక్రవారం) జరిగిన దాడుల్లో ఇద్దరు మృతి చెందగా, ఈరోజు(శనివారం) జరిగిన కాల్పుల్లో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని లా అండ్ ఆర్డర్ ను చూసే అడిషనల్ డైరెక్టర్ జనరల్ జావేద్ షమీమ్ తెలిపారు. ముస్లిం జనాభా అధికంగా ఉండే ముర్షిదాబాద్ జిల్లాలో ఇప్పటివరకూ 118 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

**కేంద్ర బలగాలను మోహరించండి**

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసన ర్యాలీలు హింసాత్మకంగా మారడంతో కోల్ కతా హైకోర్టు స్పందించింది. నిరసన ర్యాలీలను అదుపులోకి తేవడంతో పాటు హింసాత్మక ఘటనలు జరగకుండా ఉండేందుకు కేంద్ర బలగాలను మోహరించాలని హైకోర్టు ఆదేశించింది. ప్రధానంగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్న జంగీపూర్ లో కేంద్ర బల



గాలను దింపాలని ఆదేశాల్లో పేర్కొంది.

**శాంతించండి.. వక్ఫ్ చట్టాన్ని అమలు చేయం**

నిరసన కార్యక్రమాలు తీవ్ర రూపం దాల్చడంతో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. వక్ఫ్ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయబోమని నిరసనకారులకు హామీ ఇచ్చారు. 'ప్రజలకు ఇదే నా విజ్ఞప్తి. రాష్ట్రంలోని అన్ని మతాలకు ప్రజలకు నేను ఒకటే విన్నపం చేస్తున్నా. ఎవరూ కూడా రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులకు చోటివ్వకండి. ఇక్కడ ఏమైనా జరిగితే ఓవరాల్ గా నష్టపోయేది ప్రజలే. అది ఏ వర్గమైనా, ఏ కులమైనా, ఏ మతమైనా ప్రజలే ఇబ్బంది పడతారు. మీ నిరసనను హింసాత్మకంగా మారనివ్వకండి. ఎవరి జీవితమైనా ఒక్కటే. ప్రతీ మనిషి జీవితం చాలా ముఖ్యమైనదే విషయం మీరు గ్రహించండి. వక్ఫ్ సవరణ చట్టం అనేది రాష్ట్రంలో అమలు చేసే ప్రసక్తే లేదు. వక్ఫ్ సవరణ చట్టాన్ని చాలా మంది వ్యతిరేకిస్తున్న క్రమంలో దాన్ని మేము చట్టంగా గుర్తించడం లేదు. ఇది కేవలం కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన చట్టం మాత్రమే. మనం దీనికి కేంద్రాన్నే అడుగుదాం. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చాలా క్లియర్ గా ఉంది. మనకు సమాధానం చెప్పాల్సింది కేంద్ర ప్రభుత్వమే. ఈ చట్టానికి మేము మద్దతు ఇవ్వడం లేదు. అదే సమయంలో ఇక్కడ అమలుకు కూడా నోచుకోదు. ఇది గుర్తుపెట్టుకుంది. అంతా నిరసనలు విరమించి శాంతించండి' అంటూ మమతా బెనర్జీ 'ఎక్స్(వేదికగా ఒక పోస్ట్ పెట్టారు.

# ఈ బల్లులు అమ్మితే.. ఏడేళ్ల జైలు శిక్ష?

రెండు తలల పాము, ఆకర్షించే చెంబు, 'ఇదొక కదిలే యంత్రం.. ఇది చదివే మంత్రం', రైస్ పుల్లింగ్, యాంటిక్ పీస్‌లు అంటూ జనాన్ని బురిడీ కొట్టించి పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తున్న గ్యాంగ్ లు ఇప్పటికీ కనిపిస్తూనే ఉన్నాయి. ఈ తరహా మోసాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు అమలు చేస్తున్నప్పటికీ అలవాటు పడ్డ ప్రాణం దాన్ని ఎలా వదలుకుంటుంది అన్నట్లు కొందరు దీన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. అవి అరుదైనవి అని చెబుతూ, వాటికి మంత్ర శక్తి ఉందని చెబుతూ, ఇది ఉంటే మీరు కోట్లకు పడగలెత్త వచ్చు అంటూ అమాయక ప్రజల్ని మోసానికి గురి చేసిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి.. గత దశాబ్ద కాలంలో ఈ తరహా మోసాలు చాలా ఎక్కువగా జరుగుతూనే ఉన్నాయి. అమాయక ప్రజలు వెర్రి తలలు వేసుకుని వీటిని కొనుగోలు చేస్తూ భారీగా మోసపోతూనే ఉన్నారు.

ఇదే తరహాలో అరుదైన బల్లులను అమ్మబోయి ఒక గ్యాంగ్ పోలీస్ లకు పట్టుబడిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. అస్సాం రాష్ట్రంలోని దిబ్రుగర్హ్ లో అరుదైన బల్లి జాతిగా పేర్కొనబడే టోకే గెక్కో కు చెందిన 11 బల్లులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక ముఠాగా ఏర్పడిన కొందరు వీటిని అమ్మడానికి యత్నించే క్రమంలో పోలీసులు అరెస్ట్ చేశారు. దీనిపై పోలీసులకు ముందస్తు సమాచారం ఉండటంతో వారిని వలవేసి చాకచక్యంగా పట్టుకున్నారు. వీటిని అమ్మే ముగ్గురు స్మగ్లర్లను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. రూ. 60 లక్షలకు బేరం పెట్టుకుని వీటిని అమ్మడానికి యత్నించే సమయంలో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇది అంతరించిపోతున్న





బల్లి జాతిగా 1972 వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ చట్టంలో పేర్కొనడంతో దీన్ని పట్టుకోవడం, అమ్మడం నేరం కిందకు వస్తుంది.

**నేరం రుజువైతే ఏడేళ్ల జైలు శిక్ష**

ఈ బల్లులను అమ్మకానికి పెట్టడం తీవ్ర నేరం కనుక, ఒకవేళ వారు నేరం చేసినట్లు రుజువైతే ఏడేళ్ల వరకూ శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అత్యంత అరుదుగా కనిపించే ఈ బల్లులు.. భారత్ లో మాత్రం అస్సాం, అరుణాచల్ ప్రదేశాల్లో కనిపిస్తూ ఉంటాయి. వీటిని అక్రమంగా రవాణా చేస్తూ ఆగ్నేసియాలో ఎక్కువగా అమ్ముతూ ఉంటారు. వీటికి అక్కడ ఎక్కువ డిమాండ్ ఉండటంతో అక్కడకు దొడ్డిదారిన తరలిస్తూ ఉంటారు. ఈ స్మగ్లింగ్ కు పాల్పడిన వారు దేబాశిస్ దోహుతియా(34), మనాష్ దోహుతియా(28), దిపాంకర్(40)లుగా దర్యాప్తులో వెల్లడైంది. ఆ బల్లులను వారు అరుణాచల్ ప్రదేశ్ నుండి తెచ్చినట్లు సిట్ విచారణ సందర్భంగా స్పష్టం చేశారు. ఒక్కో బల్లిని రూ. 60 లక్షలకు అమ్మకానికి పెట్టినట్లు స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీమ్‌లోని ఓ సీనియర్ పోలీస్ అధికారి వెల్లడించారు.

**ఇదొక అరుదైన బల్లి జాతి**

**టోకే గెక్కో అనేది పశ్చిమాసియా ప్రాంతంలో కనిపించే అరుదైన బల్లి జాతి. ఇది పెద్దవిగా ఉండటమే కాదు.. వివిధ రంగుల్లో ఉంటాయి. ఇవి రాత్రి పూట మాత్రమే సంచరిస్తూ ఉంటాయి. దీన్ని చాలా చోట్ల అదృష్టంగా భావిస్తూ ఉండటంతో వాటికి డిమాండ్ లక్షల్లో ఉంటుంది.**

# వారి చేతిలో బందీగా మారిన బానిసలు: ఎంకే స్టాలిన్

**చెన్నై:** తమిళనాడులో అన్నా డీఎంకే, బీజేపీల పొత్తుపై ఆ రాష్ట్ర సీఎం , డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ నిప్పులు చెరిగారు. ఇదొక ఓడిపోయే అవినీతి కూటమి అంటూ ధ్వజమెత్తారు. రాష్ట్ర స్వయంప్రతిపత్తిని తాకట్టు పెట్టి అధికారం కోసం అర్రులు చాస్తున్న కూటమి, బీజేపీ చేతిలో బందీగా మారిన బానిస పార్టీ అంటూ మండిపడ్డారు. అన్నాడీఎంకేతో బీజేపీ పొత్త పెట్టుకున్న సంగతి తెలిసిందే. అన్నా డీఎంకేతో పొత్తు విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిన్న(శుక్రవారం) అధికారికంగా ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో(2026 అసెంబ్లీ ఎన్నికల్లో) ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా ఈ కూటమి ఏర్పడినట్లు అమిత్ షా పేర్కొన్నారు. దీనిపై స్టాలిన్ మాట్లాడుతూ.. 'రెండు పార్టీల సిద్ధాంతాల్లో క్లారిటీ అనేది లేదు. ఏదో పొత్తు పెట్టుకో



వాలి కాబట్టి.. అన్నా డీఎంకేతో సంధి కుదుర్చుకున్నారు. నీట్ అంశాన్ని ఏఐఏడీఎంకే వ్యతిరేకించింది. ఇదే తరహాలో రాష్ట్రంలో త్రి భాషా విధానంలో హిందీ భాషను రుద్దే అంశాన్ని, వక్ఫ్ యాక్ట్ ను, డీలిమిటేషన్ అంశాన్ని కూడా అన్నాడీఎంకే వ్యతిరేకించింది. మరి అటువంటప్పుడు బీజేపీతో అన్నాడీఎంకే ఎలా పొత్తు పెట్టుకుంది. ఇరు పార్టీలు పొత్తు పెట్టుకునేటప్పుడు కామన్ మినిమమ్ ప్రొగ్రామ్(సీఎంపీ) అనేది ఒకటి ఉంటుంది కదా. మరి వీటి గురించి హోంమంత్రి అమిత్ షా ఏమీ మాట్లాడలేదు. అలాగే అన్నాడీఎంకే నేతలు కూడా ఏమీ నోరు విప్పలేదు. ఏదో ప్రెస్ మీట్ పెట్టి పొత్తు కుదుర్చుకున్నారు. అదే పనిగా డీఎంకేపై, నాపై వ్యక్తిగత విమర్శలు గుప్పించారు. నీట్ ను సీబీఐ దర్యాప్తు చేస్తుంది కదా.. అటువంటప్పుడు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు ఎందుకు చేశారు అమిత్ షా. సీబీఐ అనేది కేంద్రం చేతుల్లోనే కదా ఉండేది' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు స్టాలిన్.

# షూటింగ్ స్పాట్‌లో డ్యాన్స్ చేస్తూ కళ్లు తిరిగి పడిపోయిన చిరంజీవి..!



మెగాస్టార్ చిరంజీవి స్వయంకృషితో ఇండస్ట్రీకి వచ్చి ఎంతో మంది మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఇప్పటికీ కుర్ర హీరోలతో పోటీ పడుతూ సినిమాలు చేస్తున్నారు. 45 ఏళ్లుగా సినిమాలు చేస్తోన్న చిరంజీవి మొత్తం 156 సినిమాల్లో 537 పాటలకు గానూ 24 వేల డ్యాన్స్ స్టెప్పులు వేసి రికార్డు సృష్టించారు. తన ప్రతిభకు ప్రతీకగానే గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది.. పసివాడి ప్రాణం చిత్రంలో బ్రేక్ డ్యాన్స్ వేసి కొత్త ఒరవడిని తీసుకొచ్చిన చిరంజీవి కొండవీటి దొంగలో స్లోమోషన్ డ్యాన్స్ వేస్తూ మరో ఒరవడిని పరిచయం చేశారు. గ్యాంగ్ లీడర్ లో వానా వానా వెల్లువాయె పాటలో స్టెప్స్ మరో హైలైట్. ఏ స్టెప్పునైన అవలీలగా చేస్తూ ప్రేక్షకులని అలరిస్తూ ఉండే చిరంజీవి..ఓ సినిమా షూటింగ్ స్పాట్‌లో కళ్లు తిరిగి పడిపోయారు. ఆ సినిమా మరేదో కాదు కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో అశ్వనీదత్ నిర్మాతగా వచ్చిన జగదేక వీరుడు అతిలోక సుందరి. ఈ సినిమా కంటే ముందు పాటల షూటింగ్ చేసారు, కానీ చిత్రానికి కీలకమైన ఒక పాట తీయడం మిగిలి ఉంది. అయితే పాట లేకుండా సినిమాని విడుదల చేయాలని అనుకున్నారు కాని సినిమాలోని కథకి పాట లింక్ అవుతుంది. దీంతో తప్పని సరిగా పాటని షూట్ చేసి సినిమాలో కలిపి విడుదల చేశారు. అయితే ఆ సమయంలో చిరంజీవి తీవ్రమైన జ్వరంతో ఉన్నారు. మలేరియా సోకడంతో విశ్రాంతి తీసుకుంటున్న చిరంజీవి పాట కోసం జ్వరాన్ని కూడా లెక్కచేయకుండా 103 డిగ్రీలు ఉన్నప్పటికీ పాట షూటింగ్‌లో పాల్గొంటాను అని పట్టుబట్టి షూటింగ్ లో పాల్గొన్నారు. షూటింగ్ జరిగే సమయంలో ఎన్నోసార్లు అదుపుతప్పి కింద పడిపోయారు. షూటింగ్‌కు వచ్చేటప్పుడు ఆయనతోపాటు ఒక వైద్యుడిని కూడా వెంట తెచ్చుకున్నారు. ఎలాగోలా పాటని పూర్తి చేశారు. కాని ఆ తర్వాత స్పృహ తప్పి పడిపోవడంతో చిరుని దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వారం తర్వాత తిరిగి చిరు కోలుకున్నారు. పనిపై ఆయనకి ఉన్న నిబద్ధత అది. నిర్మాతలని ఏ రోజు చిరు కష్టపెట్టింది లేదు. అందుకే ఎంతోమంది దర్శకులు, నిర్మాతలు, హీరోలు చిరంజీవిని ఎన్నోసార్లు పొగుడుతుండడం మనం చూస్తూనే ఉంటాం.



# 5 నిమిషాల పాట కోసం రూ.1 కోటి తీసుకున్న మిల్కీ బ్యూటీ.!

మిల్క్ బ్యూటీ తమన్నా ఒకవైపు సినిమాల్లో హీరోయిన్‌గా తన కెరీర్‌ను విజయవంతంగా కొనసాగిస్తూనే స్పెషల్ సాంగ్స్‌లో తన డ్యాన్స్‌తో మెరిసిపోతోంది. రీసెంట్‌గా వచ్చిన చాలా సినిమాలలో తమన్నానే స్పెషల్ సాంగ్‌లో మెరిసింది. దీంతో స్పెషల్ సాంగ్ అంటే తమన్నానే అనేంతగా ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించింది ఈ భామ. ఏ పాటైనా సరే, తన అద్భుతమైన డ్యాన్స్ స్కిల్స్, సహజమైన ఎక్స్‌ప్రెషన్స్‌తో ప్రేక్షకులను అలరిస్తూ కట్టిపడేస్తోంది. అందుకే నిర్మాతలు స్పెషల్ సాంగ్ కోసం ముందుగా తమన్నానే సంప్రదిస్తున్నారు, ఆమె మ్యాజిక్ సినిమాకు మరింత ఆకర్షణను జోడిస్తుందని నమ్ముతున్నారు. ఈ క్రమంలోనే తమ్ము బ్యూటీ బాలీవుడ్ నుంచి వస్తున్న రైడ్ 2 చిత్రంలో ఒక స్పెషల్ సాంగ్‌లో నటించింది. బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాలో వాణికపూర్ కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమాకు రాజ్ కుమార్ గుప్తా దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో తమన్నా నషా అనే ప్రత్యేక గీతంలో నటించి అలరించింది. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ పాట 24 గంటల్లోనే 12 మిలియన్ వ్యూస్ సాధించి, యూట్యూబ్‌లో టాప్ ట్రెండింగ్‌లో దూసుకొళ్తోంది. అయితే ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్న ఈ స్పెషల్ సాంగ్ కోసం తమన్నా ఎంత రెమ్యూనరేషన్ తీసుకుందనే చర్చ బాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. హీరోయిన్‌గా భారీ పారితోషికం అందుకునే ఈ మిల్క్ బ్యూటీ, స్పెషల్ సాంగ్స్ కోసం కూడా దాదాపు అదే స్థాయిలో వసూలు చేస్తుందని టాక్. ఈ నేపథ్యంలో 'నషా' పాటలో తన అద్భుత డాన్స్‌తో మెరిసిన తమన్నా, ఏకంగా రూ.1 కోటి రెమ్యూనరేషన్ అందుకున్నట్లు బాలీవుడ్ వర్గాల సమాచారం. కేవలం 5 నిమిషాల స్క్రీన్ ప్రెజెన్స్ కోసం తమ్ము భారీగా డిమాండ్ చేసిందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.


## ఫారెన్‌లో ఫుల్‌గా ఎంజాయ్ చేస్తున్న మహేష్ బాబు ఫ్యామిలీ..

# ఎక్కడెక్కడ తిరుగుతున్నారంటే..!




రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు భారీ ప్రాజెక్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ఇప్పటికే రెండు షెడ్యూల్స్ కూడా పూర్తి చేసుకుంది. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తుందనే హోప్ తో ఉన్నారు. సాధారణంగా రాజమౌళి సినిమా అంటే ఏ హీరోకి కూడా కాస్త రిలాక్స్ టైం ఉండదు. అలాంటి మహేష్ బాబు ఎప్పటి మాదిరిగానే గ్యాప్‌లో తన ఫ్యామిలీతో టూర్‌కి వెళ్లాడు. భార్య నమ్రత శిరోద్కర్, కుమార్తె సితార ఘట్టమనేనితో కలిసి మహేష్ బాబు ఇటలీ వెళ్లారు. ఇటలీలో ఏ ఏరియాకి వెళ్లారో తెలుసా? టస్కనీకి. అక్కడ మహేష్ బాబు ఫుల్ రిలాక్స్ అవుతున్నాడు. టస్కనీ ప్రాంతంలో హిస్టారికల్ ప్లేసులు ఎక్కువగా ఉన్నాయి. వాటిని విజిట్ చేస్తున్నారు. ఇటలీలో దిగిన ఫోటోలను నమ్రత తన సోషల్ మీడియాలో షేర్ చేశారు. అయితే... ఆ ఫోటోల్లో మహేష్ లుక్ రివీల్ కాకుండా ఆవిడ జాగ్రత్త పడింది. సితార, నమ్రత మస్త్ చిల్ అవుతున్నారు. మరో వారం పాటు మహేష్ బాబు ఫ్యామిలీ అక్కడే ఉండి ఎంజాయ్ చేస్తారని తెలుస్తుంది. ఇక ఇండియాకి వచ్చాక మహేష్ బాబు నాన్ స్టాప్ షెడ్యూల్స్‌తో బిజీ కానున్నారు. కాగా, కుటుంబంతో కలిసి ఏడాదికి మినిమం మూడు ఫారెన్ ట్రిప్స్ మహేష్ బాబు వేస్తారని ఒక టాక్ ఉంది. ఇటలీ వెళ్లే ముందు మహేష్ బాబు ఎయిర్ పోర్ట్ నుంచి తన పాస్ పోర్ట్ చూపించారు. దాంతో రాజమౌళి నుంచి మహేష్ తన పాస్ పోర్ట్ లాక్కున్నారని మీమ్స్ కూడా వచ్చాయి. ఈ మూవీ మూడో షెడ్యూల్ త్వరలోనే మొదలు కాబోతోంది. ఇందులో మహేష్ బాబుతో పాటు ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. 2027 మార్చి 25న రిలీజ్ కాబోతోందనే వార్త ఫిలిం నగర్ సర్కిల్స్ లో వైరల్ అవుతుంది. అయితే ఈ విషయంపై ఇంకా మేకర్స్ నుంచి అఫీషియల్‌గా అనౌన్స్మెంట్ రాలేదు. అయితే మార్చి 25న గురువారం కాగా, ఎప్పటిలా రాజమౌళి తన సెంటిమెంట్‌ని ఫాలో అవుతూ ఫ్రైడే కాకుండా మూవీని గురువారమే థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్టుగా తెలుస్తుంది.

# జాన్వీ కపూర్‌కు సర్‌ప్రైజ్ గిఫ్ట్‌గా రూ.5 కోట్ల కారు.. ఎవరిచ్చారో తెలుసా.!



బాలీవుడ్ నటి జాన్వీ కపూర్‌కు సర్‌ప్రైజ్ గిఫ్ట్‌ను అందించింది బిర్లా వారసురాలు అనన్య బిర్లా. దాదాపు రూ. 5 కోట్ల విలువైన లంబోర్ఘిని కారును ఆమెకు కానుకగా పంపించారు. శుక్రవారం ఉదయం లిలాక్ (పర్పుల్) రంగు లంబోర్ఘిని కారు జాన్వీ నివాసానికి చేరుకుంది. ఈ కారుతో పాటు మరో గిఫ్ట్ ప్యాక్ కూడా ఉంది, దానిపై "ప్రేమతో, నీ అనన్య" అని రాసి ఉంది. జాన్వీ నివాసానికి కారు చేరుతున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అనన్య విషయానికి వస్తే.. ప్రముఖ వ్యాపారవేత్త కుమార్ మంగళం బిర్లా పెద్ద కుమార్తె. ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ లిమిటెడ్ (ABFRL) బోర్డు డైరెక్టర్లలో ఒకరిగా ఆమె పనిచేస్తున్నారు. కేవలం 17 ఏళ్ల వయసులోనే స్వతంత్ర మైక్రోఫిన్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో తన మొదటి సంస్థను స్థాపించారు. ఇది భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న మైక్రోఫైనాన్స్ సంస్థల్లో ఒకటిగా నిలిచింది. మరోవైపు అనన్య బిర్లా, జాన్వీ కపూర్‌లు చాలా కాలంగా స్నేహితులు. ఇటీవల అనన్య బ్యూటీ ప్రోడక్ట్స్ వ్యాపారంలోకి అడుగుపెట్టినట్లు ప్రకటించారు. అయితే ఈ బ్రాండ్‌కు జాన్వీ కపూర్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నట్లు సమాచారం. తన బ్రాండ్ కోసం జాన్వీ సహకరిస్తున్నందుకు కానుకగా అనన్య ఈ ఖరీదైన లంబోర్ఘిని కారును జాన్వీకి బహుకరించారని టాక్. జాన్వీ సినిమాల విషయానికి వస్తే.. గతేడాది దేవరతో హిట్టు అందుకున్న ఈ భామ ప్రస్తుతం రామ్ చరణ్‌తో కలిసి పెద్ది అనే సినిమాలో నటిస్తుంది. ఈ సినిమాకు బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నాడు.

## క్రీడా వార్తలు | SPORTS NEWS





# అభిషేక్ అరాచకం

## రికార్డు సెంచరీతో విధ్వంసం..

## 246 టార్గెట్ ఉఫ్.. సన్ రైజర్స్ గ్రాండ్ విక్టరీ

ఇదేం బ్యాటింగ్ గురూ.. మన సన్ రైజర్స్ హైదరాబాద్ కు ఏమైంది? ఆ దూకుడు ఎందుకు కనిపించడం లేదు?.. ఇలా ఎన్నో ప్రశ్నలు. వాటన్నింటికీ సన్ రైజర్స్ గట్టి సమాధానం చెప్పింది. వరుస వైఫల్యాలను దాటి అభిషేక్ శర్మ (55 బంతుల్లో 141; 14 ఫోర్లు, 10 సిక్సర్లు) రికార్డు సెంచరీతో చెలరేగిన వేళ ఉప్పల్ స్టేడియం ఊగిపోయింది. ఐపీఎల్ హిస్టరీలో అత్యధిక స్కోరు సాధించిన ఇండియన్ బ్యాటర్ గా అభిషేక్ నిలిచాడు. అభిషేక్ విధ్వంసకర సెంచరీతో శనివారం (ఏప్రిల్ 12) పంజాబ్ కింగ్స్ పై సన్ రైజర్స్ 8 వికెట్ల తేడాతో గెలిచింది. 246 రన్స్ టార్గెట్ ను 9 బంతులు ఉండగానే ఛేదించింది. ఐపీఎల్ 2025లో వరుసగా అయిదు ఓటముల తర్వాత సన్ రైజర్స్ కు ఇదే తొలి గెలుపు. ఆరు మ్యాచ్ ల్లో రెండో విక్టరీ.

### దంచికొట్టిన ఓపెనర్లు

సన్ రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్లు అంటే ఇలాగే చెలరేగాలి కదా. గత మ్యాచ్ ల్లో క్రీజులో నిలబడలేక, మంచి ఆరంభాలను ఇవ్వలేక పెవిలియన్ చేరిపోయిన అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ (37 బంతుల్లో 66; 9 ఫోర్లు, 3 సిక్సర్లు) ఈ సారి చెలరేగిపోయారు. పంజాబ్ కింగ్స్ బౌలింగ్ ను చిత్తుచిత్తు చేశారు. అర్ష్ దీప్ వేసిన ఇన్నింగ్స్ ఫస్ట్ ఓవర్లోనే రెండు ఫోర్లతో బాదుడు మొదలైంది.

### 19 బాల్స్ లోనే

అసలే భారీ టార్గెట్. అందుకే ఫస్ట్ నుంచే దంచుడు మొదలెట్టిన అభిషేక్, హెడ్ ఏ దశలోనూ ఆగలేదు. యాన్సెన్ ఓవర్లో అభిషేక్ నాలుగు ఫోర్లు బాదాడు. అర్ష్ దీప్ ఓవర్లో హెడ్ హ్యాట్రిక్ ఫోర్లు రాబట్టాడు. ఆ వెంటనే యశ్ ఠాకూర్ ను బలి చేస్తూ అభిషేక్ 4, 6, 6 కొట్టాడు. హెడ్ ఫోర్ కొడితే, అభిషేక్ సిక్సర్.. అభిషేక్ బంతిని స్టాండ్స్ లో పడేస్తే, హెడ్ బౌండరీ దాటించడం.. ఇలా ఈ ఇద్దరి విధ్వంసం సాగింది. పవర్ ప్లేలోనే టీమ్ 83/0తో నిలిచింది. 19 బాల్స్ లోనే అభిషేక్ హాఫ్ సెంచరీ కంప్లీట్ చేసుకున్నాడు. అభిషేక్, హెడ్ వీర బాదుడుతో సన్ రైజర్స్ స్కోరు 8 ఓవర్లలోనే 100 దాటింది. తోటి ఆసీస్ క్రికెటర్ మ్యాక్స్ వెల్ ఓవర్లో హెడ్ వరుసగా రెండు సిక్సర్లు కొట్టాడు. 10 ఓవర్లకు 143 స్కోరు తో సన్ రైజర్స్ గెలుపు దిశగా దూసుకెళ్లింది.

### హెడ్ ఔటైనా


హాఫ్ సెంచరీ తర్వాత హెడ్ ఔట్ అయ్యాడు. ఈ ఓపెనింగ్ జోడీ 12.2 ఓవర్లలోనే 171 రన్స్ రాబట్టింది. ఆ వెంటనే అభిషేక్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 40 బాల్స్ లోనే హండ్రెడ్ బాదాడు. ఆ వెంటనే తన దగ్గరున్న పేపర్ ను బయటకు తీసి చూపించాడు. దీనిపై 'ఇది ఆరెంజ్ ఆర్మీ కోసం' అని రాసి ఉంది. సెంచరీ తర్వాత కూడా అభిషేక్ ఆగలేదు. మరింతగా రెచ్చిపోయాడు. విశ్వరూపం చూపించాడు. చాహల్ బౌలింగ్ లో వరుసగా 6, 4, 6 బాదిన అతను.. యశ్ ఠాకూర్ ఓవర్లో వరుసగా 6, 4 సాధించాడు. 15 ఓవర్లోనే సన్ రైజర్స్ స్కోరు 200 దాటింది. అభిషేక్ అద్భుత ఇన్నింగ్స్‌కు అర్ష్ దీప్ ఎండ్ కార్డు వేసినా.. క్లాసెన్ (21 నాటౌట్), ఇషాన్ కిషన్ (9 నాటౌట్) కలిసి మ్యాచ్ ముగించారు. ఐపీఎల్ హిస్టరీలో ఇది సెకండ్ హైయ్యస్ట్ ఛేజ్.

### రెచ్చిపోయిన శ్రేయస్

అంతకుముందు టాస్ గెలిచిన బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 245 పరుగులు చేసింది. ఆ టీమ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (36 బంతుల్లో 82; 6 ఫోర్లు, 6 సిక్సర్లు) రెచ్చిపోయాడు. ఎడాపెడా బౌండరీలు బాదాడు. ప్రభ్ సిమ్రన్ సింగ్ (23 బంతుల్లో 42; 7 ఫోర్లు, ఓ సిక్సర్) కూడా సత్తాచాటాడు. హర్షల్ పటేల్ (4/42) నాలుగు వికెట్లతో సత్తాచాటి లాస్ట్ లో పంజాబ్ కింగ్స్ ను కట్టడి చేసేలా కనిపించాడు. కానీ షమి వేసిన ఆఖరి ఓవర్లో లాస్ట్ 4 బంతుల్లో స్టొయినిస్ (11 బంతుల్లో 34 నాటౌట్) వరుసగా 4 సిక్సర్లు కొట్టాడు.

# పూరన్, మర్క్‌రమ్ విధ్వంసం

## గుజరాత్‌పై 6 వికెట్లతో గెలుపొందిన లక్నో





ఐపీఎల్ 18వ సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ (LSG) జోరు కొనసాగిస్తోంది. వరుస విజయాలతో టేబుల్ టాపర్‌గా ఉన్న గుజరాత్ టైటన్స్(Gujarat Titans)కు బిగ్ షాకిచ్చింది. ఓపెనర్ల మెరుపులతో భారీ స్కోర్ దిశగా సాగిన గుజరాత్‌ను 180 కే కట్టడి చేసిన లక్నో.. ఆ తర్వాత ఛేదనలోనూ దుమ్మురేపింది. నికోలస్ పూరన్(61), ఓపెనర్ ఎడెన్ మర్క్‌రమ్(58) హాఫ్ సెంచరీలతో చెలరేగగా 6 వికెట్ల తేడాతో జయకేతనం ఎగురవేసింది. ఆఖర్లో గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేసినా.. ఇంప్యాక్ట్ ప్లేయర్ ఆయుష్ బదొని(28 నాటౌట్), డేవిడ్ మిల్లర్(7)లు ఒత్తిడికి లోనవ్వలేదు. 20వ ఓవర్లో బౌండరీ బాదిన బదొని.. ఆ తర్వాత సిక్సర్‌తో జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. దాంతో, ఐదో విక్టరీకిపై కన్నేసిన గుజరాత్‌కు భంగపాటు తప్పలేదు. సొంతగడ్డపై లక్నో సూపర్ జెయింట్స్ పంజా విసిరింది. టేబుల్ టాపర్ అయిన గుజరాత్ టైటన్స్‌ను ఓడించి టాప్ 4లోకి దూసుకెళ్లింది. బంతితోనే కాదు ఫీల్డింగ్‌లోనూ అద్భుతంగా రాణించిన లక్నో మొదట ప్రత్యర్థిని 180కే కట్టడి చేసింది. ఛేదనలో ఓపెనర్లు ఎడెన్ మర్క్‌రమ్(58), కెప్టెన్ రిషభ్ పంత్()లు ధాటిగా ఆడారు. పవర్ ప్లేలో గుజరాత్ పేస్ గన్స్ సిరాజ్, ప్రసిధ్‌లను ఉతికేస్తూ బౌండరీలతో విరుచుకుపడ్డారు. దాంతో, 6 ఓవర్లలో 62 కొట్టిన లక్నో పటిష్ట స్థితిలో నిలిచింది. అయితే.. సుందర్ బౌలింగ్‌లో పంత్ ఔటయ్యాడు. ఆ తర్వాత వచ్చిన నికోలస్ పూరన్(61: 34 బంతుల్లో 1 ఫోర్, 7 సిక్సర్లు) మరోసారి ఆకాశమే హద్దుగా చెలరేగాడు. మరోవైపు మర్క్‌రమ్ సైతం దూకుడు పెంచి 26 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు .ఈ ఇద్దరి మెరుపులతో లక్నో స్కోర్ 10 ఓవర్లకు 114కు చేరింది. విజయానికి చేరువైన లక్నోను ప్రసిధ్ దెబ్బకొట్టాడు. మర్క్‌రమ్ ఔటయ్యాక హాఫ్ సెంచరీ బాదిన పూరన్ సైతం రషీద్ ఖాన్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. ఆ తర్వాత డేవిడ్ మిల్లర్(7), ఇంప్యాక్ట్ ప్లేయర్ ఆయుష్ బదొని(28 నాటౌట్)లు జట్టును గెలిపించే బాధ్యత తీసుకున్నారు. అయితే.. లక్నో విజయానికి 18 బంతుల్లో 18 పరుగులు అవసరం అయ్యాయి. రషీద్ ఖాన్ వేసిన 18వ ఓవర్లో బదొని ఫైన్ లెగ్‌లో ఫోర్ బాదాడు. కానీ, ఆ తర్వాత సుందర్ బౌలింగ్‌లో పెద్ద షాట్ ఆడబోయిన మిల్లర్ బౌల్డ్ అయ్యాడు. ఆఖరి ఓవర్లో 6 రన్స్ కావాలి. అబ్దుల్ సమద్(2) సింగిల్ తీయగా.. బదొని బౌండరీ కొట్టాడు.

### గిల్, సాయి మెరుపులతో..

మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటన్స్ 180 రన్స్ కొట్టింది. ఈ సీజన్‌లో భీకర ఫామ్‌లో ఉన్న గుజరాత్ టైటన్స్ నిర్దేశించిన ఓపెనర్లు శుభ్‌మన్ గిల్(60), సాయి సుదర్శన్(56)లు మరోసారి చితక్కొట్టారు. ఎకానా స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లకు చుక్కలు చూపించారు. అర్ధ శతకాలతో చెలరేగిన ఈ ద్వయం తొలి వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి భారీ స్కోర్‌కు బాటలు వేసింది. అయితే.. స్ట్రాటజిక్ టైమౌట్ తర్వాత పుంజుకున్న లక్నో బౌలర్లు గుజరాత్ మిడిలార్డర్‌ను క్రీజులో నిలవనీయలేదు. ఆఖర్లో షెర్ఫానే రూథర్‌ఫోర్డ్(22) ఒక్కడే మెరుపులు మెరిపించగా గిల్ బృందం నిర్ణీత ఓవర్లలో 180 రన్స్ చేయగలిగింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com